జైత్ర
మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్

PRGI NO TGTEL/26/A2948
జ్యోతి శ్వేత
JYYOTHI SHWETHA
దినపత్రిక
హైదరాబాద్ ॥సంపుటి:1 ॥ సంచిక: 21 ॥శనివారం ॥ 20-6-2026 ॥ పేజీలు: 8 ॥ వెల 3/-





# 50 కోట్లతో క్రీడాభివృద్ధికి...

# శ్రీకారం

## గవర్నర్ శివ ప్రతాప్ శుక్లాతో కలిసి కార్యక్రమాల్లో పాల్గొన్న సీఎం రేవంత్ రెడ్డి


తెలంగాణను దేశంలోనే విద్యా, క్రీడా రంగాల కేంద్రంగా తీర్చిదిద్దడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. రాష్ట్ర గవర్నర్ తో కలిసి శుక్రవారం ఎల్బీ స్టేడియంలో నిర్వహించిన కార్యక్రమంలో సీఎం రూ.50.73 కోట్ల వ్యయంతో రాష్ట్రవ్యాప్తంగా క్రీడా మౌలిక సదుపాయాల అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. రూ.36.65 కోట్లతో వివిధ జిల్లాల్లో మినీ స్టేడియంల నిర్మాణం, క్రీడా సదుపాయాల అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టగా, రూ.14.08 కోట్లతో గచ్చిబౌలి, ఎల్బీ స్టేడియంలలో బాలబాలికల కోసం ఫుట్‌బాల్, అథ్లెటిక్స్, హాకీ, హ్యాండ్‌బాల్ అకాడమీలను ప్రారంభించారు.

# గాంధీ సరోవర్‌కు రక్షణ శాఖ అనుమతి

### ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కృతజ్ఞతలు

### మూసీ పునరుజ్జీవనానికి కీలక ముందడుగు

### బాపూఘాట్ అభివృద్ధికి మార్గం సుగమం





**హైదరాబాద్, జూన్ 19**

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన గాంధీ సరోవర్ నిర్మాణ కార్యక్ర మానికి కేంద్ర రక్షణ శాఖ, భారత సైన్యం అనుమతి ఇవ్వడంపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, కేంద్ర రక్షణ శాఖ, భారత సైన్యానికి కృతజ్ఞతలు (మిగతా 2వ పేజీలో)



# భూ వివాదాలకు శాశ్వత పరిష్కారం

### రాష్ట్రవ్యాప్తంగా భూముల రీ-సర్వేకు శ్రీకారం

### తొలి దశలో 2,240 గ్రామాల ఎంపిక

### ప్రతి భూమికి ప్రత్యేక భూదార్ సంఖ్య

### మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

హైదరాబాద్, జూన్ 19: రాష్ట్రంలో భూ సమస్యలు, భూ వివాదాలకు శాశ్వత పరిష్కారం చూపి భూవి వాదాలు లేని తెలంగాణను నిర్మించాలనే లక్ష్యంతో ప్రభు త్వం సమగ్ర భూముల రీ-సర్వే కార్యక్రమాన్ని చేపట్టినట్లు రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోఈ చారిత్రాత్మక కార్యక్రమాన్ని వచ్చే నెల నుంచి దశల వారీగా ప్రారంభించనున్నట్లు వెల్లడించారు. రెవెన్యూ అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో




# అల్లు అర్జున్‌కు కోర్టు సమన్లు

### జూన్ 22న వ్యక్తిగతంగా హాజరుకావాలని ఆదేశం

**హైదరాబాద్, జూన్ 19**

ప్రముఖ టాలీవుడ్ నటుడు అల్లు అర్జున్ (బన్నీ)కు నాంపల్లి లోని మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ కోర్టు సమన్లు జారీ చేసింది. డిసెంబర్‌లో సంధ్య థియేటర్ వద్ద జరిగిన తొక్కిసలాట ఘటనకు సంబంధించి కోర్టు ఈ నిర్ణయం తీసుకుంది. జూన్22, 2026 ఉదయం 10:30 గంటలకు కోర్టుకు వ్యక్తిగతంగా హాజరుకావాలని సమన్లలో పేర్కొంది. 2024, డిసెంబర్ 4వ తేదీన 'పుష్ప-2' సినిమా బెనిఫిట్ షో సందర్భంగా ఈ విషాద ఘటన చోటుచేసుకుంది. సంధ్య థియేటర్ వద్ద జరిగిన తొక్కిసలాటలో రేవతి అనే మహిళ మృతి చెందగా, ఆమె కుమారుడు శ్రీతేజ్ తీవ్రంగా గాయపడ్డారు. ఈ కేసుకు సంబంధించి నాంపల్లి కోర్టు మొత్తం 19 మందికి సమన్లు జారీ చేసింది. ఈ కేసులో అల్లు అర్జున్‌ను A11 (11వ నిందితుడు)గా చేర్చారు.



# రాష్ట్రంలో మాఫియా రాజ్యమేలుతోంది

### కాంగ్రెస్ పాలనపై కేటీఆర్ తీవ్ర విమర్శలు

**మల్కాజ్‌గిరి, జూన్ 19**

రాష్ట్రంలో గత రెండున్నరేళ్లుగా ప్రజల కోసం పనిచేసే ప్రభుత్వం కనిపించడం లేదని, మాఫి యా పాలన మాత్రమే కొనసాగుతోందని భారత రాష్ట్ర సమితి కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ ఆరోపించారు. మల్కాజ్‌గిరిలో నిర్వహించిన పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో పాల్గొన్న ఆయన కాంగ్రెస్ (మిగతా 2వ పేజీలో)



# కేంద్ర నిర్ణయానికి హైకోర్టు మద్దతు

### నీట్ రీ-ఎగ్జామ్ భద్రతే లక్ష్యం

న్యూఢిల్లీ, జూన్ 19: నీట్ రీ-ఎగ్జామ్ నిర్వహణ నేపథ్యంలో టెలిగ్రామ్ యాప్‌పై కేంద్ర ప్రభుత్వం విధించిన తాత్కాలిక నిషేధాన్ని ఢిల్లీ హైకోర్టు సమర్థించింది. పరీక్షల పారదర్శకత, భద్ర తను కాపాడేందుకు తీసుకున్న ఈ నిర్ణయం చట్టబద్ధ మైనదేనని కోర్టు స్పష్టం చేసింది. జస్టిస్ తేజస్ కరియా వెలువరించిన తీర్పులో ప్రభుత్వ చర్యలను సమర్థిస్తూ కీలక వ్యాఖ్య లు చేశారు. సమాచార సాంకేతిక చట్టంలోని 69ఏ సెక్షన్ కింద కేంద్ర ప్రభుత్వం టెలిగ్రామ్ సేవలను తాత్కాలికంగా నిలిపివేసిందని కోర్టు పేర్కొంది. ఇందుకు ప్రభుత్వం (మిగతా 2వ పేజీలో)

# నేటి రాశి ఫలాలు

మేషం: ఇతరులతో వివాదాలకు దూరంగా ఉండటం మంచిది. పుణ్య క్షేత్ర దర్శనం చేసుకుంటారు. వ్యాపారమున ఒత్తిడి పెరుగుతుంది. బంధు మిత్రులతో స్వల్ప వివాదాలు కలుగుతాయి. ఉదర అనారోగ్య సమస్యలు భాదిస్తాయి. ఉద్యోగులకు స్థానచలనాలు తప్పవు. నిరుద్యోగ ప్రయత్నాలు మందగిస్తాయి.

వృషభం: చిన్ననాటి మిత్రుల నుండి విలువైన సమాచారం అందుతుంది. స్థిరాస్తి వ్యవహారాలలో నూతన ఒప్పందాలు కలసి వస్తాయి. నూతన వ్యాపారాలు ప్రారంభించిన లాభాలు అందుకుంటారు. జీవిత భాగస్వామితో దైవ సేవా కార్యక్రమాలలో పాల్గొంటారు. ఉద్యోగులకు నూతన ప్రోత్సాహకాలు అందుతాయి.

మిధునం: వాహన వ్యాపారస్తులు నూతన లాభాలు అందుకుంటారు. కుటుంబ వాతావరణం ఆనందంగా ఉంటుంది. ఆర్థికంగా సన్నిహితుల సహాయం అందుతుంది. స్థిరాస్తి వివాదాలు తొలగి ఊరట చెందుతారు. ఉద్యోగులకు పదోన్నతులు పెరుగుతాయి. ఆకస్మిక ధనలబ్ధి కలుగుతుంది.

కర్కాటకం: వృత్తి వ్యాపారాలు మందకొడిగా సాగుతాయి. చేపట్టిన వ్యవహారాలు ముందుకు సాగక నిరాశ పెరుగుతుంది. ప్రయాణాలు వాయిదా వేయడం మంచిది. కుటుంబ సభ్యుల అనారోగ్య సమస్యలు చికాకు కలిగిస్తాయి. ఇంటా బయట జాగ్రత్తగా వ్యవహరించాలి. ఉద్యోగాలు సామాన్యంగా సాగుతాయి.

సింహం: బంధువులతో స్థిరాస్తి వివాదాలు కలుగుతాయి. ఆరోగ్య విషయంలో అశ్రద్ధ చేయడం మంచిది కాదు. పాత ఋణాలు తీర్చడానికి నూతన ఋణాలు చేస్తారు. దూర ప్రయాణ సూచనలు ఉన్నవి. వృత్తి వ్యాపారాలు అంతంత మాత్రంగా సాగుతాయి. ఉద్యోగమున అదనపు బాధ్యతల వలన విశ్రాంతి ఉండదు.

కన్య: సమాజంలో ప్రముఖులతో పరిచయాలు పెరుగుతాయి. చేపట్టిన పనులు అప్రయత్నంగా పూర్తవుతాయి. ఆధ్యాత్మిక సేవా కార్యక్రమాలలో పాల్గొంటారు. నిరుద్యోగ యత్నాలలో విజయం వరిస్తుంది. స్నేహితుల నుండి ఆకస్మిక ధనలాభం కలుగుతుంది. వృత్తి వ్యాపారాలలో లాభాలు పొందుతారు.

తుల: కుటుంబ పెద్దల సహకారంతో కొన్ని పనులు పూర్తవుతాయి. దూర ప్రయాణాలలో వాహన ఇబ్బందులు కలుగుతాయి. బంధుమిత్రుల నుండి కొన్ని వ్యవహారాలలో ఒత్తిడి పెరుగుతుంది. వ్యాపారాలు కొంత మందగిస్తాయి. వృత్తి ఉద్యోగాలలో అధిక శ్రమతో అల్ప ఫలితం పొందుతారు.

వృశ్చికం: నూతన వస్తు వాహనాలు కొనుగోలు చేస్తారు. భూ సంబంధిత క్రయ విక్రయాలలో లాభాలను పొందుతారు. ఇంటా బయట పెద్దల ఆదరణ పెరుగుతుంది. అన్ని రంగాల వారికి ఆదాయం బాగుంటుంది. నూతన వ్యాపారాలకు పెట్టుబడులు అందుతాయి. ఉద్యోగాలలో పదోన్నతులు పెరుగుతాయి.

ధనస్సు: ప్రయాణాలలో వాహన ఇబ్బందులుంటాయి. సోదరులతో స్థిరాస్తి వివాదాలు పెరుగుతాయి. వ్యాపారంలో నిరుత్సాహ వాతావరణం ఉంటుంది. ఉద్యోగుల విషయంలో అధికారుల నుండి ఒత్తిడి పెరుగుతుంది. ఆధ్యాత్మిక చింతన పెరుగుతుంది. ఆర్థిక వ్యవహారాలు నిరాశ కలిగిస్తాయి.

మకరం: ఉద్యోగ విషయమై అనుకూల మార్పులు చోటు చేసుకుంటాయి. విలువైన గృహోపకరణాలు కొనుగోలు చేస్తారు. చేపట్టిన పనులు అనుకున్న సమయానికి పూర్తి చేస్తారు. వ్యాపారాల విస్తరణ ప్రయత్నములలో ఆటంకలు తొలుగుతాయి. దేవాలయ దర్శనం చేసుకుంటారు.

కుంభం: ఆప్తుల నుండి శుభకార్య ఆహ్వానాలు అందుతాయి. భూ సంబంధిత వివాదాల నుంచి తెలివిగా బయటపడతారు. వృత్తి వ్యాపారాలు ఉత్సాహంగా సాగుతాయి. ఆకస్మిక ధన లాభాలు పొందుతారు. కీలక వ్యవహారాలలో మీ కలలు నిజమవుతాయి. ఉద్యోగస్తులకు తగిన గుర్తింపు లభిస్తుంది.

మీనం: ప్రయాణాలు అకస్మాత్తుగా వాయిదా పడతాయి. వృధా ఖర్చులు తప్పవు. కీలక వ్యవహారాలు నిదానంగా పూర్తి చేస్తారు. కొన్ని పనులలో సన్నిహితుల నుండి నిందలు పడవలసి వస్తుంది. వ్యాపారాలు నిదానంగా సాగుతాయి. వృత్తి ఉద్యోగాలలో సహోద్యోగుల ప్రవర్తన చికాకు కలిగిస్తుంది.





# 50 కోట్లతో క్రీడాభివృద్ధికి శ్రీకారం

## యంగ్ ఇండియా స్టూడెంట్ కిట్స్ పంపిణీ డ్రగ్స్ వ్యతిరేక ప్రతిజ్ఞ

హైదరాబాద్, జూన్ 19

27.50 లక్షల మంది విద్యార్థులకు 'యంగ్ ఇండియా స్టూడెంట్ కిట్స్' పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. విద్యార్థులతో కలిసి డ్రగ్స్ వ్యతిరేక ప్రతిజ్ఞ చేయించారు. అలాగే 'అన్న-అక్క మెంటార్‌షిప్' కార్యక్రమాన్ని ఆవిష్కరించారు. సభలో మాట్లాడిన సీఎం రేవంత్ రెడ్డి తెలంగాణ భవిష్యత్తు తరగతి గదుల్లోనే ఉందనే నమ్మకంతో ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. విద్యను ఖర్చుగా కాకుండా భవిష్యత్ తరాలకు పెట్టుబడిగా భావిస్తూ రూ.26,600 కోట్లను కేటాయించామని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల పునరుద్ధరణ, ప్రీ-ప్రైమరీ విద్యా విధానం అమలు, యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్ల ఏర్పాటు వంటి కార్యక్రమాలతో విద్యా రంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకొస్తున్నామని పేర్కొన్నారు. రాబోయే ఒలింపిక్స్‌ను లక్ష్యంగా పెట్టుకుని యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీని ఏర్పాటు చేశామని, గ్రామీణ యువతలోని క్రీడా ప్రతిభను వెలికితీయడానికి రాష్ట్రవ్యాప్తంగా ఆధునిక క్రీడా మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేస్తున్నామని చెప్పారు. కృత్రిమ మేధ (ఏఐ) ప్రభావంతో ఉద్యోగ రంగంలో వేగంగా మార్పులు చోటుచేసుకుంటున్న నేపథ్యంలో యువతకు నైపుణ్యాభివృద్ధి అత్యంత అవసరమని సీఎం పేర్కొన్నారు. ఇంగ్లీష్‌తో పాటు జర్మన్, జపనీస్ భాషల శిక్షణ, స్కిల్ డెవలప్‌మెంట్ కార్యక్రమాలు, స్కిల్ యూనివర్సిటీ ఏర్పాటుతో ప్రపంచ స్థాయి అవకాశాలకు యువతను సిద్ధం చేస్తున్నామని వివరించారు. "మీ తలరాతను మార్చేది చదువొక్కటే. మీరు చదవండి... మీకు అవసరమైన అవకాశాలు, సదుపాయాలు కల్పించే బాధ్యత ప్రభుత్వానిదే" అని సీఎం విద్యార్థులకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి , మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# రాష్ట్రంలో మాఫియా రాజ్యమేలుతోంది

(మొదటి పేజీ తరువాయి)

ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేశారు. రాష్ట్రంలోని ప్రతి ప్రాంతంలో ప్రజలు కాంగ్రెస్ పాలనపై తీవ్ర అసంతృప్తితో ఉన్నారని, ఎన్నికలు ఎప్పుడు వచ్చినా తెలంగాణలో మళ్లీ గులాబీ జెండా ఎగరడం ఖాయమని స్పష్టం చేశారు. రానున్న ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని పార్టీ కార్యకర్తలు ఇప్పటి నుంచే క్షేత్రస్థాయిలో పని చేయాలని కేటీఆర్ పిలుపునిచ్చారు. పార్టీ బలోపేతానికి ప్రతి కార్యకర్త సైనికుడిలా పనిచేయాలని సూచించారు. సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ఇంటింటికీ తీసుకెళ్లి ప్రజలతో మరింత అనుబంధం పెంచుకోవాలని కోరారు. ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియలో అర్హులైన ఓటర్ల పేర్లు తొలగించకుండా జాగ్రత్తలు తీసుకోవాలని పార్టీ నాయకులకు సూచించారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత కేసీఆర్ నాయకత్వంలో రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించిందని కేటీఆర్ పేర్కొన్నారు. తెలంగాణ ఏర్పాటుకు ముందు విద్యుత్ కొరత, తాగునీటి సమస్యలు, వ్యవసాయ సంక్షోభం తీవ్రంగా ఉండేవని గుర్తు చేశారు. కేసీఆర్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత విద్యుత్ సమస్యను శాశ్వతంగా పరిష్కరించి రైతులకు, గృహ వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ అందించారని చెప్పారు. విద్యుత్ రంగంలో జరిగిన మార్పులు తెలంగాణ అభివృద్ధికి బలమైన పునాదిగా నిలిచాయని అన్నారు. హైదరాబాద్ నగరంతో పాటు రాష్ట్రవ్యాప్తంగా తాగునీటి సమస్యలను పరిష్కరించడంలో తమ ప్రభుత్వం కీలక పాత్ర పోషించిందని కేటీఆర్ పేర్కొన్నారు. ప్రతి ఇంటికి తాగునీరు అందించే లక్ష్యంతో చేపట్టిన కార్యక్రమాలు ప్రజలకు ఎంతో ఉపయోగపడ్డాయని చెప్పారు. ఒకప్పుడు ఖాళీ బిందెలతో నిరసనలు చేసిన పరిస్థితి ఉండేదని, ఇప్పుడు ఆ సమస్యలు పూర్తిగా తగ్గాయని తెలిపారు. మౌలిక వసతుల కల్పనలో తెలంగాణ దేశానికి ఆదర్శంగా నిలిచిందన్నారు.

# భూ వివాదాలకు శాశ్వత పరిష్కారం

(మొదటి పేజీ తరువాయి)

మంత్రి మాట్లా డుతూ రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 10,954 రెవెన్యూ గ్రామాల్లో తొలి దశలో హైదరాబాద్ మినహా 32 జిల్లాల నుంచి 70 గ్రామాల చొప్పున మొత్తం 2,240 గ్రామాలను ఎంపిక చేసినట్లు తెలిపారు. ఈ గ్రామాల్లో రీ-సర్వే పనులు ప్రారంభించి భూముల అసలు హద్దులను గుర్తించే ప్రక్రియ చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. ఇందుకు అవసరమైన ఏర్పాట్లను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. భూమి రైతుకు కేవలం ఆస్తి మాత్రమే కాదని,అది అతని జీవనాధారమని మంత్రి అన్నారు. ప్రతి అంగు ళం భూమికి స్పష్టమైన హద్దులు, ప్రతి సర్వే సంఖ్యకు ఖచ్చితమైన గుర్తింపు, ప్రతి రైతుకు యాజమాన్య భరోసా కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. రీ-సర్వే పూర్తయిన తర్వాత భూముల యాజ మాన్యంపై తలెత్తే వివాదాలకు పూర్తిస్థాయిలో చెక్ పడుతుందని విశ్వాసం వ్యక్తం చేశారు. ప్రస్తుతం రాష్ట్రంలోని అనేక ప్రాంతాల్లో నిజాం కాలం నాటి సర్వే రికార్డులే ఆధారంగా కొనసాగుతున్నాయ ని మంత్రి పేర్కొన్నారు. దశాబ్దాల కాలంలో భూముల విభజనలు, ఉపవిభాగాలు పెరగడం, పట్టణీకరణ విస్తరించడం, పరిపాలనా సరిహద్దులు మారడం వల్ల అసలు హద్దులపై స్పష్టత లేకుండా పోయిందన్నారు. ఈ పరిస్థితుల కారణంగా వేలాది భూ వివాదాలు తలెత్తుతున్నాయని,వాటికి శాశ్వత పరిష్కారం కోసం ప్రభుత్వం ఈ రీ-సర్వే కార్యక్రమాన్ని చేపడుతోందని వివరించారు. రాష్ట్రంలో నక్షాలు లేని 378 గ్రామాలను గుర్తించామని, వాటిలో ఇప్పటికే ఐదు గ్రామాల్లో రీ-సర్వే పూర్తి చేసి భూదార్ సంఖ్యలు కేటాయించినట్లు తెలిపారు. మిగిలిన గ్రామాల్లో కూడా ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో సర్వే పనులు వేగంగా కొనసాగుతున్నాయని చెప్పారు. పాతకాలపు గొలుసులు, కర్రలు, కొలత పరికరాలకు స్వస్తి చెప్పి అత్యాధునిక ఉపగ్రహ ఆధారిత పద్ధతులను వినియోగించనున్నట్లు వెల్లడించారు. రీ-సర్వే అనంతరం ప్రతి భూమికి ప్రత్యేక భూదార్ సంఖ్య కేటాయించి ఆధార్ మాదిరిగా భూదార్ కార్డులు జారీ చేయనున్నట్లు మంత్రి తెలిపారు. సర్వే వివరాలను భూ భారతి వ్యవస్థలో నమోదు చేసి డిజిటల్ రూపంలో భద్రపరుస్తామని చెప్పారు. రాష్ట్రంలో ప్రస్తుతం రెండు కోట్లకు పైగా సర్వే సంఖ్యలు ఉండగా వాటన్నింటికీ దశలవారీగా ప్రత్యేక గుర్తింపు సంఖ్యలు కేటాయించేందుకు కార్యాచరణ రూపొందించామని వెల్లడించారు.

ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా అమలు చేసేందుకు వేలాది మంది లైసెన్సు పొందిన సర్వేయర్లకు శిక్షణ ఇచ్చినట్లు మంత్రి తెలిపారు. ప్రతి మండలానికి అవసరమైన సిబ్బందిని నియమించి ప్రత్యేక పర్యవేక్షణ వ్యవస్థను ఏర్పాటు చేశామని చెప్పారు. రీ-సర్వే పూర్తయిన తర్వాత భూముల నమోదు, యాజమాన్య మార్పిడి, మ్యుటేషన్ వంటి ప్రక్రియలు మరింత పారదర్శకంగా, వేగంగా జరిగే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. తెలంగాణ చరిత్రలో భూముల రీ-సర్వే ఒక మైలురాయిగా నిలుస్తుందని, దీనివల్ల భూ వివాదాలు గణనీయంగా తగ్గి రైతులకు పూర్తి స్థాయి భద్రత లభిస్తుందని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆశాభావం వ్యక్తం చేశారు.

# రాహుల్‌కు భట్టి శుభాకాంక్షలు



హైదరాబాద్, జూన్ 19: పార్లమెంట్ ప్రతిపక్ష నాయకుడు రాహు ల్ గాంధీ జన్మదినం సందర్భంగా తెలంగా ణ ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క శుభాకాంక్షలు తెలిపారు. దేశ స్వరంగా, ప్రజల ఆకాంక్షలకు ప్రతినిధిగా నిలుస్తున్న నాయకుడిగా రాహుల్ గాంధీని కొనియాడారు. ఆయన జన్మదినం సందర్భంగా సామాజిక మాధ్యమ వేదికలో ప్రత్యేక సందేశాన్ని విడుదల చేశారు. రాహుల్ గాంధీ ఆలోచనా స్పష్టత, ప్రజల పట్ల చూపుతున్న మానవత్వం, దేశ భవిష్యత్తుపై ఉన్న దూరదృష్టి భారత ప్రజాస్వామ్యానికి మార్గదర్శకంగా నిలుస్తున్నాయని భట్టి విక్రమార్క పేర్కొన్నారు. దేశ ప్రజల సమస్యలను నిరంతరం ప్రస్తావిస్తూ ప్రజాస్వామ్య విలువలను కాపాడేందుకు ఆయన చేస్తున్న కృషి ప్రశంసనీయమని అన్నారు.

# గాంధీ సరోవర్‌కు ..

(మొదటి పేజీ తరువాయి)

తెలిపారు. బాపూఘాట్ ప్రాంతంలో చేపట్టనున్న గాంధీ సరోవర్ కార్యక్రమానికి అనుమతి లభించడం రాష్ట్ర ప్రభుత్వానికి కీలక విజయమని ముఖ్య మంత్రి పేర్కొన్నారు. ఈ నిర్ణయం మూసీ నది పునరుజ్జీవన కార్యక్రమానికి మరింత ఊతమిస్తుందని అన్నారు. నది తీర ప్రాంతాలను పర్యావరణ, సాంస్కృతిక, ప్రజా అవసరా లకు అనుగుణంగా అభివృద్ధి చేయాలన్న ప్రభుత్వ లక్ష్యానికి ఇది ముఖ్యమైన ముందడుగుగా అభివర్ణించారు. మూసీ నది పునరుద్ధరణతో పాటు నది తీర ప్రాంతాలను ప్రజల కు ఉపయోగపడే విధంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం సమగ్ర కార్యాచరణ రూపొందించిందని ముఖ్యమంత్రి తెలిపారు. పచ్చదనం పెంపు, ప్రజలకు విహార ప్రదేశాల ఏర్పాటు, పర్యావరణ పరిరక్షణ, సాంస్కృతిక కార్యక్రమాల కు అనువైన వేదికల అభివృద్ధి వంటి అంశాలకు ప్రాధాన్యం ఇస్తున్నట్లు పేర్కొన్నారు.

# టెలిగ్రామ్‌కు హైకోర్టు షాక్

(మొదటి పేజీ తరువాయి)

సమర్పించిన కారణాలు సమంజసంగా ఉన్నాయని, ప్రస్తుత పరిస్థితుల్లో ఇలాంటి చర్యలు అవసరమని అభిప్రా యపడింది. పరీక్షలకు సంబంధించిన సున్నితమైన సమాచారాన్ని దుర్వినియోగం చేసే అవకాశాలను అరికట్టడమే ప్రధాన ఉద్దేశమని తెలిపింది. విచారణలో ప్రశ్నాపత్రాల లీకేజీ అంశం ప్రధానంగా చర్చకు వచ్చింది. కొన్ని ముఠా లు పరీక్షా పత్రాలను అక్రమంగా సేకరించి అభ్యర్థులకు పంపిస్తున్నాయని, వాటిని టెలిగ్రామ్ ద్వారా పంచుకున్న ట్లు కేంద్రం కోర్టుకు వివరించింది. ఈ ఆరోపణలను పరిగ ణనలోకి తీసుకున్న న్యాయస్థానం, పరీక్షల విశ్వసనీ యతను కాపాడేందుకు తక్షణ చర్యలు అవసరమని పేర్కొంది. కేంద్ర ప్రభుత్వం అనాలోచితంగా వ్యవహరించ లేదని, అన్ని అంశా లను పరిశీలించిన తర్వాతే నిర్ణయం తీసుకుందని కోర్టు స్పష్టం చేసింది. ప్రజా ప్రయోజనాలు, విద్యార్థుల భవిష్యత్తు, పరీక్షా వ్యవస్థపై నమ్మకాన్ని దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం చర్యలు చేపట్టిందని తెలిపింది. ప్రభుత్వ ఆదేశాలను అసమతు ల్యంగా లేదా చట్టవిరుద్ధంగా పరిగణించలేమని వ్యాఖ్యానించింది. టెలిగ్రామ్ సంస్థ మాత్రం తమపై మాత్రమే నిషేధం విధించడం సరైంది కాదని వాదించింది. దేశంలో ఇతర సామాజిక మాధ్యమ వేదికలు యథావిధిగా పనిచేస్తుండగా తమ సేవలను మాత్రమే నిలిపివేయడం వివక్షపూరితమని పేర్కొంటూ కోర్టును ఆశ్రయించింది. అయితే ప్రభుత్వ చర్యల కు

# శ్వేత

## సంపాదకీయం

**శుక్రవారం 19-6-2026**

# సమగ్ర పంటల విధానమే మేలు!

దేశంలో పంటల విధానంపై సమగ్రత లోపించింది. రైతులు తమకు తోచిన పంటలు వేస్తున్నారు. ధరల కోసం దేబురిస్తున్నారు. ప్రభుత్వాలు వీలైనంత మేరకు కొంటున్నాయి. వీలుకాకపోతే చేతులెత్తేస్తున్నాయి. ముఖ్యంగా వరి, జొన్న, మక్కజొన్నలనే పండించడం వల్ల రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. ఇప్పటికే దేశంలో ధాన్యం బాగా పోగయ్యింది. డిమాండ్ ఉన్న పంటలు వేయడం, సేంద్రియం వైపు మళ్లడంలో రైతులు ఇప్పటికీ వెనకడుగు వేస్తున్నారు. దీంతో సంప్రదాయ వరి పండిస్తూ చేతులు కాల్చుకుంటున్నారు. ఈ విధానం ముందుగా పోవాలి. ప్రభుత్వాలు కూడా రైతులను చైతన్యం చేయడం లేదా, ఫలానా పంటలు వేయండి అని చెప్పడం లేదు. తెలంగాణ రైతుల పరిస్థితి తీసుకుంటే ఇదే అర్థం అవుతోంది. సన్నాలు పండించిన వారికి గిట్టుబాటు ధరలు వస్తున్నాయి. మద్దతు ధరలను మించి కొంటున్నారు. తాజాగా మహబూబాబాద్ జిల్లా కేసముద్రం మార్కెట్ యార్డులో సన్న వడ్లకు డిమాండ్ పెరిగింది. వరుసగా రెండ్రోజుల నుంచి 3వేలకు పైగానే మద్దతు ధరలు దక్కుతున్నాయి. ప్రభుత్వం కూడా సన్నాలు పండించాలని, ఏడు రకాలను తాజాగా గుర్తించింది. కానీ మండలాల వారిగా రైతులతో మాట్లాడి వారిని ఒప్పించి, రైతుల పంటల విధానంలో మార్పులు తీసుకుని రావాల్సి ఉంది. ఇవన్నీ ఒక ఎత్తయితే కేంద్రం కూడా ధాన్యం మొత్తాన్ని కొనడానికి ముందుకు రావడం లేదు. టార్గెట్లు విధించి, ఆమేరకు ధాన్యం సేకరణకు రాష్ట్ర ప్రభుత్వాలకు చెబుతోంది. గతంలో బిఆర్ఎస్ అధికారంలో ఉండగా ఇలాగే జరిగింది. ఢిల్లీలో కూడా బిఆర్ఎస్ అధినేత, ఆనాటి సిఎం కెసిఆర్ ధర్నాకు దిగారు. అయినా నేటికీ మార్పు రాలేదు.

అందువల్ల రాష్ట్రాలు తమకుతాముగా సమగ్ర పంటల విధానం అమలు చేయాలి. కేవలం ఉచిత విద్యుత్, రైతుభరోసా డబ్బులు వేస్తే సరిపోదు. ఏ పంటలు వేయాలో, వాటికి మార్కెటింగ్ ఎలా ఉంటుందో తెలియచేయాలి. ప్రభుత్వాల జోక్యం లేకుండానే రైతులు పంటలు అమ్ముకునే పరిస్థితిని తీసుకుని రావాలి. ఇక విషయానికి వస్తే ఖరీఫ్ ముంచుకొస్తున్న వేళ రబీ పంటల కొనుగోళ్లు ఇంకా సాగుతూనే ఉన్నాయి. ఈ క్రమంలో పంటల కొనుగోళ్లపై కాంగ్రెస్ సర్కార్ చేతులెత్తేసింది. రైతులు పండించిన చివరి గింజ వరకు కొంటామంటూ చెబుతూ వచ్చిన మంత్రులు, ఇప్పుడు ఊహించని రీతిలో ప్రకటన చేశారు. ధాన్యం, మక్కజొన్న, జొన్న, కందులు, పెసర్లు.. ఇలా పంట ఏదైనా సరే ఇక రాష్ట్ర ప్రభుత్వం తరపున పంటలు కొనుగోలు చేసే ప్రసక్తే లేదని తేల్చి చెప్పింది. కేంద్ర ప్రభుత్వం ఎంత కొనాలని చెబితే అంతే కొంటామని, అంతకుమించి గింజ కూడా ఎక్కువ కొనేది లేదని స్పష్టంచేసింది. గురువారం సచివాలయంలో సీఎం రేవంత్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన ఇన్‌ఫార్మల్ క్యాబినెట్ సమావేశంలో పంటల కొనుగోళ్లపై సంచలన నిర్ణయం తీసుకున్నది. ధాన్యం, మక్కలు, జొన్నలు, కందులు, పెసర్లు ఇలా పంటల కొనుగోళ్ల బాధ్యతను రాష్ట్ర ప్రభుత్వం కేంద్రంపైకి నెట్టేసింది. రాష్ట్రంలో ఉత్పత్తి అయ్యే ఏ పంటనైనా సరే కేంద్రం నిర్దేశించిన కోటా మేరకే కొనుగోలు చేస్తామని మంత్రి ఉత్తమ్ మీడియాకు చెప్పారు. పంటలకు మద్దతు ధరను కేంద్రమే నిర్ణయిస్తుంది కాబట్టి.. పంటల కొనుగోలు బాధ్యత కూడా కేంద్ర ప్రభుత్వానిదేనని అన్నారు.

మంత్రి వ్యాఖ్యల నేపథ్యంలో ఇకపై రైతులు పండించిన పంటలను కొనుగోలు చేయబోదనేది సుస్పష్టం. కేంద్రం కొనుగోలు చేస్తామని చెప్పిన పంటలను, కేంద్రం ఇచ్చిన కోటా మేరకే ఇక్కడ కేంద్రం ఇచ్చిన డబ్బులతో రైతుల నుంచి సేకరించి కేంద్రానికి అందిస్తుంది. అంతేగానీ ఒకవేళ కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన కోటాకు మించి పంటలు ఉత్పత్తి అయితే ఆ పంటలను రాష్ట్ర ప్రభుత్వం తన సొంత నిధులతో కొనుగోలు చేయబోదు. పంటల కొనుగోళ్లలో కేంద్రం కోటా పూర్తికాగానే ఆ కేంద్రాలను మూసివేస్తుంది. కొనుగోలు కేంద్రాల్లో ధాన్యంతో పాటు ఇతర పంటలు ఉన్నా ఇక నుంచి ప్రభుత్వం పట్టించుకోదు. మొత్తంగా ఇదే విషయం అర్థం అవుతోంది. ఇలాంటి సమయంలో ఏం చేయాలన్నది కూడా ప్రభుత్వం ప్రకటించాలి. ఎంతమేరకు వరి వేయాలో, అదికూడా ఏ రకం వేయాలో రైతులకు చెప్పాలి. ఏయే జిల్లాల్లో వరి వేయాలో, వేయకూడదో కూడా నిర్ణయించాలి. నిజానికి ధాన్యం సేకరణ బాధ్యత కేంద్రానిదే. కేంద్రం ఆదేశాల మేరకే రాష్ట్రాలు ధాన్యం సేకరణ చేసి, ఎఫ్‌సిఐకి అప్పగిస్తుంది. ఈ క్రమంలో రాష్ట్రంలోని వివిధ పంటలను కేంద్ర ప్రభుత్వం కొంత మేరకే కొనుగోలు చేస్తుంది. ఉత్పత్తి అయిన ధాన్యంలో మూడో వంతు మాత్రమే కొంటుంది. ఇక పెసర్లు, కందులు, జొన్నలు, సన్‌ఫ్లవర్, సోయాబీన్ వంటి పంటలను మొత్తం ఉత్పత్తిలో 25శాతం మాత్రమే కొనుగోలు చేస్తుంది. ఒకవేళ కేంద్ర ప్రభుత్వానికి అవసరముండి, పంట ఎక్కువగా ఉంటే మరో 5-10శాతం వరకు కొనుగోలుకు అనుమతి ఇస్తుంది. ఒత్తిడి తెచ్చినర రాష్ట్రాలకే ఈ వెసులబాటు ఉంటుంది. ఇకపోతే కేంద్ర ప్రభుత్వం.. మక్కలను మాత్రం అసలే కొనుగోలు చేయదు. ఎంత ఉత్పత్తి అయినా సరే ఒక్క గింజ కూడా కొనుగోలు చేయదు. ఈ క్రమంలో కేంద్ర ప్రభుత్వం తన కోటా కింద కొనుగోలు చేయగా మిగిలిన పంటలను కొనుగోలు చేసే బాధ్యత రాష్ట్ర ప్రభుత్వాలదే. కేంద్రం తన కోటా మేరకు కొనుగోలు చేసిన తర్వాత మిగిలిన పంట ఉత్పత్తులను రాష్ట్ర ప్రభుత్వం కొనుగోలు చేసేందుకు నిరాకరిస్తే రైతులు ఏం కావాలన్నది ఆలోచన చేయాలి. అందువల్ల పంటల విధానం అమల్లోకి రావాలి. ఏయే పంటలు వేయాలో, ఎంత విస్తీర్ణంలో వేయాలో ప్రభుత్వం నిర్ణయించాలి. అందుకు తగ్గట్లుగా ఎరువుల,విత్తనాలు సరఫరాచేసి, ఆయా పంటలనే ప్రోత్సహించడం ద్వారా సంక్షోభాన్ని అధిగమించవచ్చు.




# ఎంఎస్ఎంఈలు, విద్యా రుణాలకు ప్రాధాన్యం

**డిజిటల్ ఆర్థిక నేరాల నియంత్రణకు ప్రత్యేక ఎస్వోపీ.. 235వ రాష్ట్రస్థాయి బ్యాంకర్ల కమిటీ సమావేశంలో సీఎం సూచనలు**

అమరావతి, జూన్ 19: అమరావతిలో జరిగిన 235వ రాష్ట్రస్థాయి బ్యాంకర్ల కమిటీ సమావేశంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు డిజిటల్ ఆర్థిక నేరాల నియంత్రణకు బ్యాంకులు ప్రత్యేక ఎస్వోపీ రూపొందించాలని సూచించారు. డిజిటల్ అరెస్టులు, సైబర్ మోసాల వల్ల ప్రజలు భారీగా నష్టపోతున్న నేపథ్యంలో బ్యాంకులు సెంట్రల్ ట్రాన్సాక్షన్ మానిటరింగ్ సెల్స్ ఏర్పాటు చేసి ఫైనాన్షియల్ ఫ్రాడ్స్‌ను అరికట్టాలని ఆదేశించారు. 2026-27 ఆర్థిక సంవత్సరానికి రూ.8.10 లక్షల కోట్ల వార్షిక రుణ ప్రణాళికను విడుదల చేసిన సీఎం, వ్యవసాయం, ఎంఎస్ఎంఈ, గృహ నిర్మాణం, విద్య వంటి ప్రాధాన్యతా రంగాలకు భారీ స్థాయిలో రుణాలు అందించాలని బ్యాంకులకు సూచించారు. రాష్ట్ర అభివృద్ధిలో ఎంఎస్ఎంఈ రంగం కీలకమని పేర్కొన్న సీఎం, ఈ రంగానికి రూ.1.55 లక్షల కోట్ల రుణాలు అందించేందుకు బ్యాంకులు ముందుకు రావాలని కోరారు. స్టార్టప్‌లు, ఆవిష్కరణలు, యువ పారిశ్రామికవేత్తలకు రుణాల మంజూరులో ప్రోత్సాహం ఇవ్వాలని సూచించారు. అలాగే దేశ, విదేశాల్లో ఉన్నత విద్య అభ్యసించే విద్యార్థులకు విద్యా రుణాలపై అదనంగా 4 శాతం వడ్డీ రాయితీ ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించినట్లు ప్రకటించారు. పీఎం విద్యానిధి, పీఎం సూర్యఘర్, పీఎం విశ్వకర్మ, స్టాండప్ ఇండియా వంటి కేంద్ర పథకాల అమలులో బ్యాంకులు పూర్తి సహకారం అందించాలని ఆయన కోరారు. అమరావతి ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్‌లో భూములు పొందిన బ్యాంకులు తమ నిర్మాణాలను త్వరగా పూర్తి చేసి ఐకానిక్ భవనాలు నిర్మించాలని సీఎం సూచించారు. మహిళలు, యువతకు డైరీ, ఆక్వా, కోల్డ్‌చైన్ వంటి రంగాల్లో రుణ సహకారం పెంచి ఉపాధి అవకాశాలు విస్తరించాలని చెప్పారు. రాష్ట్రం ఈ ఏడాది 15 శాతం వృద్ధిరేటు సాధించే లక్ష్యంతో ముందుకు సాగుతోందని, ఆ లక్ష్య సాధనలో బ్యాంకుల పాత్ర కీలకమని పేర్కొన్నారు. సమావేశంలో యూనియన్ బ్యాంక్ సీఎండీ ఆశీష్ పాండే, సీఎస్ సాయిప్రసాద్ తదితర ప్రతినిధులు పాల్గొన్నారు.



# అక్రమాలపై సీబీఐ దర్యాప్తు జరగాల్సిందే

**డీఎస్సీ స్కాం, అమరావతి నిర్మాణంలో అక్రమాలు**

**ప్రధాని, హోంమంత్రికి వినతిపత్రాలు ఇస్తున్నాం**

**వైయస్ఆర్‌సీపీ ఎంపీల వెల్లడి**

న్యూఢిల్లీ, జూన్, 19; రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం చేపడుతున్న భూకేటాయింపులు, డీఎస్సీ నిర్వహణ, ఇసుక, మద్యం విధానాలపై తీవ్ర ఆరోపణలు చేసిన వైఎస్సార్ కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ నేత, రాజ్యసభ సభ్యుడు వైవీ సుబ్బారెడ్డి, ఈ అంశాలపై సీబీఐ దర్యాప్తు జరిపించాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరనున్నట్లు తెలిపారు. ఢిల్లీలో పార్టీ ఎంపీలు పీవీ మిధున్ రెడ్డి, వైయస్ అవినాష్ రెడ్డి, మద్దిల గురుమూర్తిలతో కలిసి నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. విశాఖపట్నం, అమరావతిలో ప్రభుత్వ భూములను అనుచితంగా కేటాయిస్తున్నారని, డీఎస్సీ పరీక్షల నిర్వహణలో కూడా నిబంధనలను ఉల్లంఘిస్తూ అక్రమాలు జరిగాయని ఆరోపించారు. ఈ అంశాలపై ప్రధాని నరేంద్రమోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షాతో పాటు సీబీఐ డైరెక్టర్‌కు ఫిర్యాదు చేయనున్నట్లు వెల్లడించారు.

ఇసుక, మద్యం, పీడీఎస్ బియ్యం పంపిణీ వ్యవస్థల్లో కూడా భారీ అక్రమాలు జరుగుతున్నాయని వైవీ సుబ్బారెడ్డి ఆరోపించారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో పారదర్శక విధానాలు అమలు చేశామని, ప్రస్తుతం ఉచిత ఇసుక పేరుతో దోపిడీ సాగుతోందన్నారు. అలాగే విజయవాడ కృష్ణలంకలో జరిగిన సాయికృష్ణ మృతి ఘటనతో పాటు క్రాంతికుమార్ కేసుపై కూడా స్వతంత్ర దర్యాప్తు జరగాలని డిమాండ్ చేశారు. బాధిత కుటుంబాలకు న్యాయం జరిగే వరకు వైఎస్సార్‌సీపీ పోరాటం కొనసాగిస్తుందని, భూకేటాయింపులు మరియు ఇతర అవినీతి ఆరోపణలపై సాక్ష్యాలతో కూడిన ఫిర్యాదులను కేంద్రానికి సమర్పించనున్నట్లు తెలిపారు.

# నేడు ఖాతాల్లోకి రూ.3,125 కోట్ల అన్నదాత సుఖీభవ నిధులు

చిలకలూరిపేట, జూన్ 19: రాష్ట్రంలోని రైతులకు పెట్టుబడి భారం తగ్గించి వ్యవసాయాన్ని మరింత లాభసాటిగా మార్చే లక్ష్యంతో అమలు చేస్తున్న అన్నదాత సుఖీభవ--పీఎం కిసాన్ పథకం కింద 2026-27 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన తొలి విడత ఆర్థిక సాయాన్ని రాష్ట్ర ప్రభుత్వం శనివారం విడుదల చేయనుంది. పల్నాడు జిల్లా చిలకలూరిపేట మండలం లింగంగుంట్ల గ్రామంలో నిర్వహించే కార్యక్రమంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రైతుల ఖాతాల్లో నిధులను జమ చేయనున్నారు. ఈ విడతలో మొత్తం రూ.3,125.47 కోట్లను 46,85,838 రైతు కుటుంబాలకు పంపిణీ చేయనున్నారు. ఈ పథకం ద్వారా లబ్ధి పొందనున్న రైతుల్లో 45,69,817 మంది భూ యజమాని రైతులు ఉండగా, అటవీ హక్కుల చట్టం కింద సాగు చేస్తున్న 1,16,021 మంది రైతు కుటుంబాలు కూడా ఉన్నాయి. విడుదల చేయనున్న మొత్తంలో రాష్ట్ర ప్రభుత్వ వాటా రూ.2,342.92 కోట్లు కాగా, కేంద్ర ప్రభుత్వం పీఎం కిసాన్ పథకం కింద రూ.782.55 కోట్లు అందిస్తోంది. గత ఆర్థిక సంవత్సరంలో ఈ పథకం కింద మొత్తం రూ.8,985.41 కోట్లను రైతులకు పంపిణీ చేయగా, అందులో రాష్ట్ర ప్రభుత్వ వాటా రూ.6,560.18 కోట్లు, కేంద్ర ప్రభుత్వ వాటా రూ.2,425.23 కోట్లు. సూపర్ సిక్స్ హామీల్లో భాగంగా అమలు చేస్తున్న ఈ పథకం కింద ప్రతి అర్హ రైతు కుటుంబానికి ఏడాదికి రూ.20 వేల ఆర్థిక సహాయం అందిస్తున్నారు. ఇందులో రాష్ట్ర ప్రభుత్వం రూ.14 వేలు, కేంద్ర ప్రభుత్వం పీఎం కిసాన్ ద్వారా రూ.6 వేలు అందిస్తోంది. ఈ మొత్తాన్ని మూడు విడతల్లో రైతుల ఖాతాలకు జమ చేస్తారు. ప్రస్తుత తొలి విడతలో రాష్ట్ర ప్రభుత్వం రూ.5 వేలు, కేంద్ర ప్రభుత్వం రూ.2 వేలు కలిపి ఒక్కో రైతు కుటుంబానికి రూ.7 వేల చొప్పున అందించనుంది. ఈ కార్యక్రమంలో పాల్గొనేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు లింగంగుంట్ల గ్రామంలో పర్యటించనున్నారు. ఉదయం 11.55 గంటలకు అమరావతి నుంచి బయలుదేరి మధ్యాహ్నం 12.15 గంటలకు గ్రామానికి చేరుకుంటారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించి అక్కడి సౌకర్యాలను పరిశీలిస్తారు. రైతులతో ముఖాముఖి సమావేశంలో పాల్గొని వారి అభిప్రాయాలను తెలుసుకుంటారు. తర్వాత పార్టీ కార్యకర్తల సమావేశంలో పాల్గొని సాయంత్రం ప్రజావేదిక సభలో ప్రసంగిస్తారు. రైతు సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని, వ్యవసాయ రంగాన్ని మరింత బలోపేతం చేసేందుకు చర్యలు కొనసాగిస్తామని ఈ సందర్భంగా ముఖ్యమంత్రి వెల్లడించే అవకాశం ఉంది. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పల్నాడు జిల్లా చిలకలూరిపేట మండలం లింగంగుంట్ల గ్రామంలో నిర్వహించనున్న అన్నదాత సుఖీభవ, స్వచ్ఛాంధ్ర - స్వర్ణాంధ్ర కార్యక్రమాలకు హాజరుకానున్న నేపథ్యంలో జిల్లా కలెక్టర్ కఈతికా శుక్లా, ఎస్పీ బి. కృష్ణారావు భద్రతా ఏర్పాట్లను స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా హెలిప్యాడ్, అంగన్‌వాడీ కేంద్రం, పార్కింగ్ ప్రాంతాలు, ప్రజాసభ వేదిక తదితర ప్రదేశాలను తనిఖీ చేసిన ఎస్పీ.. అడ్వాన్స్ సెక్యూరిటీ లైజన్ నిర్వహించి భద్రతా అంశాలపై సమీక్ష చేపట్టారు.

# మేకెదాటు డ్యామ్ నిర్మాణం కుదరదు

**కావేరి డెల్టా రైతులకు తీరని నష్టం**

చెన్నై,జూన్19(ఆర్ఎన్ఎ): కర్ణాటక ప్రభుత్వం కావేరీ నదిపై మేకెదాటు వద్ద డ్యామ్ నిర్మాణానికి చేస్తున్న ప్రయత్నాలను తమిళనాడు ప్రభుత్వం వ్యతిరేకించింది. మేకెదాటు డ్యామ్ నిర్మాణాన్ని తమిళనాడు ప్రభుత్వం తీవ్రంగా వ్యతిరేకిస్తోంది. డ్యామ్ నిర్మాణంతో కావేరి డెల్టా రైతులకు తీవ్రనష్టం కలుగుతుందని తమిళనాడు ప్రభుత్వం ఆరోపిస్తోంది. గత నెలలో తమిళనాడు ముఖ్యమంత్రి జోసఫ్ విజయ్ ప్రధాని నరేంద్ర మోదీని కలిసిన సందర్భంగా మేకెదాటు వద్ద డ్యామ్ నిర్మాణాన్ని అడ్డుకోవాలని వినతి పత్రం సమర్పించారు. కావేరి నిర్వాహక మండలిలో సభ్యులుగా ఉన్న రాష్ట్రాల ఆమోదం లేకుండా మేకెదాటు ప్రాజెక్టును చేపట్టడానికి వీలులేదని, ఈ విషయమై కేంద్ర జలశక్తి శాఖకు, కేంద్ర నీటి వనరులకు శాఖకు ఆదేశాలివ్వాలని మోదీని కోరారు. తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల మధ్య వివాదానికి దారి తీసిన మేకెదాటు ప్రాజెక్ట్‌పై తమిళనాడు అసెంబ్లీలో కీలక తీర్మానం జరిగింది. మేకెదాటు డ్యామ్ నిర్మాణాన్ని వ్యతిరేకిస్తూ శుక్రవారం ఉదయం ముఖ్యమంత్రి విజయ్ అసెంబ్లీలో తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. కర్ణాటక ప్రతిపాదిస్తున్న ఈ ప్రాజెక్ట్ కావేరి నదీ జలాల వివాదాల ట్రిబ్యునల్ తుది అవార్డుతో పాటు.. సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పులను పూర్తిగా ఉల్లంఘిస్తోందని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. పర్యావరణ, సాంకేతిక అనుమతులు సహా ప్రాజెక్టుకు ఎలాంటి అనుమతులూ ఇవ్వొద్దని కేంద్ర ప్రభుత్వాన్ని ఆయన కోరారు.




## సింగరేణిని ప్రమాద రహిత సంస్థగా తీర్చిదిద్దాలి

**భూపాలపల్లి, జూన్ 19**

ప్రతి పనికి సంబంధించిన భద్రతా సూత్రాలను కచ్చితంగా పాటిస్తూ విధులు నిర్వహిస్తే గనుల్లో ప్రమాదాలను పూర్తిగా నివారించవచ్చని, తద్వారా సింగరేణిని ప్రమాద రహిత సంస్థగా తీర్చిదిద్దవచ్చని గనుల భద్రత విభాగం సంచాలకుడు డాక్టర్ ఐ. సత్యనారాయణ పేర్కొన్నారు. భూపాలపల్లి ప్రాంతంలో నిర్వహించిన రక్షణ త్రైపాక్షిక సమీక్షా సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొని ఆయన మాట్లాడారు. గనుల్లో పనిచేసే ప్రతి ఉద్యోగి భద్రతా నిబంధనలను అత్యంత బాధ్యతాయుతంగా పాటించాలని ఆయన సూచించారు. భద్రత విషయంలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావు ఉండకూడదని, చిన్న పొరపాటు కూడా పెద్ద ప్రమాదాలకు దారితీసే అవకాశం ఉంటుందని హెచ్చరించారు. ప్రతి ఉద్యోగి తన భద్రతతో పాటు సహచర ఉద్యోగుల భద్రతను కూడా దృష్టిలో ఉంచుకుని విధులు నిర్వహించాలని అన్నారు. సింగరేణి సంస్థలో భద్రతకు అత్యున్నత ప్రాధాన్యత ఇవ్వాలని డాక్టర్ సత్యనారాయణ పేర్కొన్నారు. గనుల్లో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం వినియోగంతో పాటు భద్రతా ప్రమాణాలను మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఉందన్నారు.



## వర్షాకాల సన్నద్ధతపై ప్రత్యేక దృష్టి

**మల్కాజిగిరి, జూన్ 19**

వర్షాకాలంలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని మల్కాజిగిరి పురపాలక సంస్థ కమిషనర్ అధికారులను ఆదేశించారు. కీసర, నాగారం ప్రాంతాల్లో ఉప కమిషనర్, ఇంజినీరింగ్ అధికారులు, ఇతర శాఖల అధికారులతో కలిసి పర్యటించి పరిస్థితిని పరిశీలించారు. ఈ సందర్భంగా గతంలో భారీ వర్షాల సమయంలో నీరు నిలిచిపోయిన ప్రాంతాలను పరిశీలించారు. తెరిచి ఉన్న మురుగు కాలువలు, వర్షపు నీటి కాలువల అనుసంధానం, నీటి పారుదల వ్యవస్థల పనితీరును సమీక్షించారు. అధిక వర్షాల సమయంలో కాలువలు పొంగిపొర్లే అవకాశం ఉన్న ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించారు. ప్రస్తుతం ఉన్న మురుగు కాలువల పరిస్థితిని పరిశీలించిన కమిషనర్, నీటి ప్రవాహానికి ఆటంకంగా ఉన్న మట్టి, చెత్త, ఇతర అడ్డంకులను వెంటనే తొలగించాలని అధికారులను ఆదేశించారు. కాలువలు, వర్షపు నీటి మార్గాలను పూర్తిస్థాయిలో శుభ్రం చేసి నీరు సాఫీగా వెళ్లేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

## పిల్లలకు పిక్కలు ఎందుకు నొప్పి వస్తాయి?

**డెస్క్ జూన్ 19**

పిల్లల్లో పిక్కలు నొప్పి రావడం చాలా సాధారణంగా కనిపించే సమస్య. ముఖ్యంగా పాఠశాలకు వెళ్లే వయసులో ఉన్న పిల్లలు కాళ్ల పిక్కలు నొప్పిగా ఉన్నాయని తరచూ చెబుతుం టారు. చాలా సంద ర్భాల్లో ఇది ఎదుగుదల ప్రక్రియలో భాగంగా వచ్చిన నొప్పే అయినప్పటికీ, కొన్నిసార్లు ఇతర ఆరోగ్య సమస్య లకు కూడా సంకేతంగా ఉండవచ్చు. పిల్లలు రోజంతా పరు గులు తీయడం, ఆటలు ఆడ టం, ఎక్కువసేపు నిలబడటం వల్ల కాళ్ల కండరాలపై ఒత్తిడి పెరుగుతుంది. దీంతో సాయంత్రం లేదా రాత్రి సమయంలో పిక్కల నొప్పి రావచ్చు.



విశ్రాంతి తీసుకు న్న తర్వాత సాధారణంగా ఈ నొప్పి తగ్గిపోతుంది. ఎదుగుదల నొప్పులు కూడా ఒక ప్రధాన కారణం. ఎముకలు, కండరాలు వేగంగా అభివృద్ధి చెందుతున్న సమయంలో కాళ్లలో, ముఖ్యంగా పిక్కల ప్రాంతంలో నొప్పి అనిపించవచ్చు. ఈ నొప్పి సాధారణంగా ప్రమాదకరం కాదు. కాల్షియం, విటమిన్ డి వంటి పోషకాల లోపం కూడా పిక్కల నొప్పికి కారణమవుతుంది.

## మాతృభాషను కాపాడుతూ ఆంగ్ల భాషా నైపుణ్యాలు పెంపొందించాలి

**హైదరాబాద్, జూన్ 19**

విద్యార్థుల్లో ఆంగ్ల భాషా నైపుణ్యాలను పెంపొందించడంతో పాటు వారి మాతృభాషలు, సాంస్కృతిక వారసత్వాన్ని పరిరక్షించాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందని రాష్ట్ర గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా అన్నారు. లోక్ భవన్‌లో నిర్వహించిన కార్యక్ర మంలో గిరిజన సంక్షేమ విద్యాసంస్థల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులతో ఆయన సమావేశమై మాట్లాడారు. గిరిజన సంక్షేమ విద్యాసంస్థల ఉపాధ్యాయుల కోసం నిర్వహించిన రెండు వారాల ఆంగ్ల భాషా ప్రావీణ్య శిక్షణ కార్యక్రమాన్ని విజయవంతంగా పూర్తిచేసిన ఉపాధ్యాయు లకు గవర్నర్ ధ్రువపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులను అభినందించిన ఆయన, దూర ప్రాంత గిరిజన ప్రాంతాల్లో విద్యా సేవలు అందిస్తున్న వారి కృషిని ప్రశంసించారు. ఆంగ్ల భాషా బోధనలో నైపు ణ్యాలను పెంపొందించడం ద్వారా విద్యార్థులకు మెరుగైన అవకాశాలు లభిస్తాయని గవర్నర్ పేర్కొన్నారు. ఉపాధ్యాయుల భాషా



సామర్థ్యం పెరిగితే విద్యార్థుల్లో ఆత్మవి శ్వాసం, సంభాషణ నైపుణ్యాలు, ఉన్నత విద్య మరియు ఉద్యోగ అవకాశాలపై అవగాహన మరింత పెరుగుతుందని తెలిపారు. అయితే ప్రపంచ స్థాయి పోటీలకు విద్యార్థులను సిద్ధం చేసే క్రమంలో వారి మాతృభాషలను నిర్లక్ష్యం చేయకూడదని స్పష్టం చేశారు. మాతృభాషలు కేవలం సంభా షణ సాధనాలు మాత్రమే కాకుండా సంస్కృతి, సంప్రదా యాలు, జీవన విధానాలకు ప్రతిబింబమని పేర్కొన్నారు.

## మౌలిక వసతుల పనులకు వేగం

**హైదరాబాద్, జూన్ 19**

నగరంలో మౌలిక వసతుల అభివృద్ధి పనులను వేగవంతం చేసేందుకు సైబరాబాద్ పురపాలక సంస్థ కమిషనర్ మియాపూర్, కూకట్‌పల్లి ప్రాంతాల్లో విస్తృతంగా పర్యటించారు. శాసనసభ్యుడు అరె కపూడి గాంధీ, మండల కమిష నర్లు, ప్రధాన నగర ప్రణాళికాధికారి, ఇతర అధికారులతో కలిసి జరుగుతున్న పనులను పరిశీలించారు. మియాపూర్ కూడలి, ఆల్విన్ కూడలి వద్ద నిర్మాణంలో ఉన్న ఎగువ మార్గాల పనులను పరిశీలించి పురోగతిని సమీక్షించారు. భూసేకరణ పరిస్థితి, పనులకు ఎదురవుతున్న అడ్డంకులు, పెండింగ్ అంశాలపై అధికారులతో చర్చించారు. పనుల్లో జాప్యం లేకుండా అవసరమైన చర్యలు చేపట్టాలని సూచిం చారు. వివిధ శాఖల మధ్య సమన్వయాన్ని మరింత బలోపేతం చేసి నిర్మాణ పనులను వేగంగా పూర్తి చేయాలని కమిషనర్ ఆదేశించారు. ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా పనుల నిర్వహణలో ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. రవాణా సౌలభ్యం మెరుగుపడేలా ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగాలని చెప్పారు. ఈ సందర్భంగా



మియాపూర్ ప్రధాన కూడలి వద్ద నిర్మిస్తున్న ఎగువ మార్గం, భూగర్భ మార్గం పనులను కూడా పరిశీలించారు. అలాగే మంజీరా పైపులైన్ రహదారి, ఇందు నిర్మాణ సంస్థ సమీప ప్రాంతాల్లో జరుగుతున్న రహదారి విస్తరణ పనుల పురోగతిని సమీక్షించారు. పనుల నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ ఉండకూడదని అధికారులను ఆదేశించారు. ఐడీఎల్ సరస్సు పరిసర ప్రాంతాల్లో చేపడు తున్న నిర్మాణ పనులను కూడా పరిశీలించారు. సరస్సు పరిసర ప్రాంతాల అభివృద్ధి, మౌలిక సదుపాయాల కల్పన, ప్రజల అవసరాలకు అనుగుణంగా చేపడుతున్న కార్యక్రమాలపై వివరాలు తెలుసుకున్నారు.

## చార్మినార్‌లో కల్తీ ఆహార గోదాముపై దాడి

**హైదరాబాద్, జూన్ 19**

ఆహార కల్తీ, అసురక్షిత ఆహార తయారీపై కొనసాగుతున్న ప్రత్యేక నిఘాలో భాగంగా చార్మినార్ ప్రాంతంలో అక్రమంగా నిర్వహిస్తున్న ఓ ఆహార గోదాముపై అధికారులు ఆకస్మిక దాడి నిర్వహించారు. హైదరాబాద్ ఆహార కల్తీ నిఘా బృం దం, ఆహారభద్రత అధికారులతో కలిసి హుస్సేనీఆలం పోలీసు స్టేషన్ పరిధిలోని పంచ్ మొహల్లా, న్యూలాడ్ బజార్ ప్రాంతంలో ఈ తనిఖీలు చేపట్టింది.



తనిఖీల సమయంలో ప్రజారోగ్యానికి తీవ్ర ముప్పు కలిగించే పరిస్థితుల్లో ఆహార పదార్థాల తయారీ, నిల్వ జరుగుతున్నట్లు అధికారులు గుర్తించారు. సంబంధిత అనుమతులు లేకుండానే గోదామును నిర్వహిస్తున్నట్లు తేలింది. ఆహార పదార్థాల తయారీలో నిషేధిత కృత్రిమ రంగులు ఉపయోగిస్తున్నట్లు, పాడైపోయిన వంట నూనెను పదేపదే వినియోగిస్తున్నట్లు గుర్తించారు. అలాగే తాగునీటి నాణ్యతకు సంబంధించిన ధ్రువీకరణ పత్రాలు లేకపోవడం, పరిశుభ్రత ప్రమాణాలు పూర్తిగా విస్మరించడం, కీటకాల నివారణ చర్యలు చేపట్టకపోవడం వంటి అనేక లోపాలను అధికారులు గుర్తించారు. గోదాము పరిసరాలు అత్యంత అపరిశుభ్రంగా ఉండటంతో ఆహార భద్రతపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. దాడుల్లో సుమారు 110 కిలోల వేయించిన కోడి మాంసం, ఆరు డబ్బాల వంట నూనె, కృత్రిమ రసాయన రంగులను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఈ అక్రమ కార్యకలాపాలకు బాధ్యులైన ఇద్దరిని అదుపులోకి తీసుకుని విచారణ చేపట్టారు. స్వాధీనం చేసుకున్న సామగ్రిని పోలీసుల ఆధీనంలో ఉంచారు.ం

## బీజేపీపై జగ్గారెడ్డి విమర్శలు

**సంగారెడ్డి, జూన్ 19**

టీపీసీసీ కార్యనిర్వాహక అధ్యక్షుడు జగ్గారెడ్డి మరోసారి తనదైన రాజకీయ వ్యాఖ్యలతో వార్తల్లో నిలిచారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలను సంగారెడ్డిలో ఘనంగా నిర్వహించిన సందర్భంగా ఆయన కేంద్రంలోని భారతీయ జనతా పార్టీ ప్రభుత్వంపై, ప్రధాని నరేంద్ర మోదీపై తీవ్ర విమర్శలు గుప్పించారు. ఈ సందర్భంగా నిర్వహించిన విలేకరుల సమావేశంలో జగ్గారెడ్డి మాట్లాడుతూ సంగారెడ్డి జిల్లా పరిధిలో ఉన్న అనేక ప్రముఖ కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థలను కాంగ్రెస్ ప్రభుత్వాలే తీసుకొచ్చాయని పేర్కొన్నారు. భారీ పరిశ్రమలు, రక్షణ రంగ సంస్థలు, విద్యా, పరిశోధనా సంస్థలు దేశాభివృద్ధికి పునాదులుగా నిలిచాయని అన్నారు. అలాంటి సంస్థలను ప్రైవేటు సంస్థలకు అప్పగించే విధానాన్ని కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తోందని ఆరోపిం చారు. దేశ నిర్మాణంలో కాంగ్రెస్ నాయకుల పాత్ర ఎంతో గొప్పదని జగ్గారెడ్డి అన్నారు. జవహర్‌లాల్ నెహ్రూ, ఇంది రా గాంధీ, రాజీవ్ గాంధీ వంటి నాయకులు దేశాభివృద్ధి కోసం అనేక కీలక సంస్థలను ఏర్పాటు చేశారని పేర్కొన్నారు. దేశానికి వారు చేసిన సేవలను ప్రజలు ఎప్పటికీ మరువలేరని అన్నారు.




## రాష్ట్ర ఆర్థిక బలోపేతంపై కేబినెట్ ఉపసంఘం సమీక్ష

**హైదరాబాద్, జూన్ 19**

రాష్ట్ర ఆర్థిక బలోపేతం, ఆదాయ వనరుల పెంపు లక్ష్యంగా వనరుల సమీకరణ కేబినెట్ ఉపసంఘం సమావేశం డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో నిర్వహించారు. ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, జూపల్లి కృష్ణారావు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు. “మన వనరులే మన పెట్టుబడి” అనే లక్ష్యంతో రాష్ట్ర ఆదాయ వృద్ధి, సంపద సృష్టి, అభివృద్ధి కార్యక్రమాలకు అవసరమైన నిధుల సమీకరణపై విస్తృతంగా చర్చించారు. ప్రభుత్వానికి అదనపు ఆదాయం సమకూర్చే అవకాశాలను గుర్తించి వాటిని కార్యరూపంలోకి తీసుకురావాలని అధికారులకు సూచించారు. పర్యాటక రంగాన్ని ఆదాయ వనరుగా మరింత బలోపేతం చేయడంపై సమావేశంలో ప్రత్యేక దృష్టి సారించారు. ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్య విధానంలో పర్యాటక ఆస్తుల అభివృద్ధి, దేవాలయ పర్యాటకం, ప్రకృతి



పర్యాటకం, ఆరోగ్య పర్యాటకాన్ని విస్తరించే అంశాలపై చర్చించారు. వారాంతాల్లో హెలికాప్టర్ పర్యాటక సేవలను ప్రారంభించే అవకాశాలను కూడా పరిశీలించారు. శ్రీశైలం, నాగార్జునసాగర్ వెనుక జలాల ప్రాంతాల్లో కొత్త పర్యాటక ప్రాజెక్టులను అభివృద్ధి చేయడానికి ప్రణాళికలు రూపొందించాలని అధికారులను ఆదేశించారు. పర్యాటక రంగ విస్తరణ ద్వారా ఉపాధి అవకాశాలు పెరగడంతో పాటు ప్రభుత్వ ఆదాయం కూడా గణనీయంగా పెరుగు తుందని అభిప్రాయపడ్డారు.




## చిన్నారుల సంక్షేమమే నిజమైన అభివృద్ధి

**మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క**

**హైదరాబాద్, జూన్ 19**

చిన్నారుల ఆరోగ్యం, ఆనందం, విద్యాభివృద్ధే నిజమైన అభివృద్ధికి పునాదులని మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క పేర్కొన్నారు. చాంద్రాయణగుట్ట నియోజకవర్గంలోని అరుంధతి నగర్‌లో ఏర్పాటు చేసిన అంగన్వాడీ కేంద్రం--పాలన కేంద్రాన్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా చిన్నారులకు యూనిఫాంలు పంపిణీ చేసి, వారు ప్రదర్శించిన విద్యా, సాంస్కృతిక కార్యక్రమాలను వీక్షించి అభినందించారు. హైదరాబాద్ నగరంలో తొలి పాలన కేంద్రాన్ని చాంద్రాయణగుట్టలో ఏర్పాటు చేయడం సంతోషకరమని మంత్రి అన్నారు. ఆరు నెలల నుంచి మూడు సంవత్సరాల వయస్సు గల చిన్నారులకు సంరక్షణ, పోషకాహారం, ఆటల ద్వారా అభ్యాసం అందించేందుకు ఈ కేంద్రం ఉపయోగపడుతుందని తెలిపారు. ప్రైవేటు నర్సరీల్లో భారీ ఖర్చులు చేయాల్సిన అవసరం లేకుండా ప్రభుత్వమే ప్రజల వద్దకు నాణ్యమైన సేవలను తీసుకువచ్చిందని పేర్కొన్నారు. అంగన్వాడీ కేంద్రం, పాలన కేంద్రాన్ని ఒకే ప్రాంగణంలో ఏర్పాటు చేయడం ద్వారా ఒకే కుటుంబంలోని చిన్నారులందరికీ సమగ్ర సేవలు అందేలా చర్యలు తీసుకున్నామని చెప్పారు. ఉపాధి, ఉద్యోగాల కోసం బయటకు వెళ్లే తల్లులకు ఈ కేంద్రాలు ఎంతో ఉపయోగపడతాయని తెలిపారు. పిల్లల సంరక్షణ కోసం మహిళలు తమ ఉపాధిని వదులుకోవాల్సిన పరిస్థితులను అధిగమించేందుకు ప్రభుత్వం భరోసా కల్పిస్తోందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆలోచనల మేరకు రాష్ట్రవ్యాప్తంగా పాలన కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నామని మంత్రి వెల్లడించారు.



## ప్రజావాణితో శిశువుకు ప్రాణదానం

**హైదరాబాద్, జూన్ 19**

తెలంగాణ ప్రభుత్వ ప్రతిష్ఠాత్మక ప్రజావాణి కార్యక్రమం మరో కుటుంబంలో ఆశలు నింపింది. పుట్టుకతోనే తీవ్రమైన గుండె సమస్యతో బాధపడుతున్న ఓ నవజాత శిశువుకు సకాలంలో వైద్య సహాయం అందించి ప్రాణాలను కాపాడింది. ప్రజావాణి బృందం చొరవతో చిన్నారి అత్యవసర శస్త్రచికిత్స విజయవంతంగా పూర్తయింది. హైదరాబాద్‌లోని ఎల్‌బీ నగర్‌కు చెందిన రోజువారీ కూలీ అంజనేయులు దంపతులకు ఇటీవల ఆడబిడ్డ జన్మించింది. గ్రేసీ అనే ఆ చిన్నారికి పుట్టిన కొద్దిసేపటికే గుండెకు సంబంధించిన తీవ్రమైన జన్యుపరమైన లోపం ఉన్నట్లు వైద్యులు గుర్తించారు. దీంతో కుటుంబ సభ్యులు తీవ్ర ఆందోళనకు గురయ్యారు. చిన్నారిని పలు ఆసుపత్రుల్లో పరీక్షించగా అత్యవసర శస్త్రచికిత్స అవసరమని వైద్యులు సూచించారు. అయితే చికిత్సకు భారీ మొత్తంలో ఖర్చు అవుతుందని చెప్పడంతో ఆర్థికంగా బలహీనమైన కుటుంబం తీవ్ర ఇబ్బందుల్లో పడింది. కుమార్తె ప్రాణాలను కాపాడాలనే ఆవేదనతో అంజనేయులు ప్రభుత్వ సహాయం కోసం ప్రజావాణిని ఆశ్రయించారు. విషయం తెలుసుకున్న ప్రజావాణి బృందం వెంటనే స్పందించింది. చిన్నారిని ప్రత్యేక వైద్య సేవలు అందించే ఆసుపత్రిలో చేర్పించి అవసరమైన ఏర్పాట్లు చేసింది. ఆరోగ్య శాఖ ఉన్నతాధికారులతో సమన్వయం చేసి చికిత్సకు కావాల్సిన అన్ని అనుమతులను వేగంగా మంజూరు చేయించింది. ప్రభుత్వం ప్రత్యేకంగా రూ.8 లక్షలు మంజూరు చేయడంతో చిన్నారికి అవసరమైన గుండె శస్త్రచికిత్స విజయవంతంగా నిర్వహించారు.

# జనసేన తెలంగాణ కార్యాలయం ప్రారంభం

హైదరాబాద్, జూన్ 19

జనసేన తెలంగాణ రాష్ట్ర నూతన కార్యాలయం హైదరాబాద్‌లోని మణికొండలో ప్రారంభమైంది. పార్టీ నాయకులు, జనసైనికులు, వీర మహిళల సమక్షంలో ప్రత్యేక పూజలు నిర్వహించి శాస్త్రోక్తంగా కార్యాలయ ప్రవేశ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా పార్టీ శ్రేణుల్లో ఉత్సాహభరిత వాతావరణం నెలకొంది. నూతన కార్యాలయం ప్రారంభం తెలంగాణలో పార్టీ విస్తరణకు కీలక ముందడుగుగా భావిస్తున్నట్లు నాయకులు పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా పార్టీ కార్యకలాపాల నిర్వహణ, ప్రజా సమస్యలపై పోరాటాలకు ఈ కార్యాలయం ప్రధాన కేంద్రంగా పనిచేయనుందని తెలిపారు. ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు పార్టీ అభివృద్ధికి కృషి చేస్తున్న కార్యకర్తలను అభినందించారు. తెలంగాణలో జనసేనను మరింత బలోపేతం చేసేందుకు కార్యాచరణ రూపొందిస్తున్నామని వెల్లడించారు. ప్రజలకు చేరువై వారి సమస్యల పరిష్కారానికి కట్టుబడి ఉంటామని పేర్కొన్నారు. ప్రత్యేక పూజల అనంతరం పార్టీ జెండాకు వందనం చేసి కార్యాలయంలోకి ప్రవేశించారు. జనసైనికులు, వీర మహిళలు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. పార్టీ నినాదాలతో పరిసర ప్రాంతం మారుమోగింది. తెలంగాణలో పార్టీ విస్తరణ, సంస్థాగత బలోపేతం, ప్రజా సమస్యలపై ఉద్యమాలకు నూతన కార్యాలయం కేంద్రంగా ఉండనుందని నాయకులు తెలిపారు. యువత, మహిళలు, వివిధ వర్గాల ప్రజలను పార్టీతో మరింతగా అనుసంధానించేందుకు ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టనున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర స్థాయి నాయకులు, పార్టీ కార్యకర్తలు, జనసైనికులు, వీర మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. నూతన కార్యాలయం ప్రారంభంతో తెలంగాణలో పార్టీ కార్యకలాపాలు మరింత వేగవంతం అవుతాయని నాయకులు ఆశాభావం వ్యక్తం చేశారు.



# యాదాద్రిలో ప్రైవేటీకరణ వ్యతిరేక ఆందోళన

యాదాద్రి భువనగిరి, జూన్ 19

యాదాద్రి ఉష్ణ విద్యుత్ కేంద్రంలో ప్రైవేటీకరణ చర్యలకు వ్యతిరేకంగా విద్యుత్ ఇంజనీర్లు ఆందోళన చేపట్టారు. యాష్ నిర్వహణ, బొగ్గు నిర్వహణ విభాగాలను ప్రైవేటు సంస్థలకు అప్పగించే ప్రక్రియను నిరసిస్తూ నల్ల బ్యాడ్జీలు ధరించి విధులు నిర్వహించారు. ప్రభుత్వ రంగ సంస్థలను బలోపేతం చేయాల్సిన సమయంలో ప్రైవేటీకరణ దిశగా అడుగులు వేయడం ఆందోళన కలిగిస్తోందని వారు పేర్కొన్నారు. విద్యుత్ కేంద్రంలోని కీలక విభాగాలకు సంబంధించిన టెండర్లను వెంటనే రద్దు చేయాలని ఇంజనీర్లు డిమాండ్ చేశారు. ఉత్పత్తి వ్యవస్థలో భాగమైన పనులను ప్రైవేటు సంస్థలకు అప్పగించడం వల్ల ప్రభుత్వ రంగ సంస్థల సామర్థ్యం దెబ్బతింటుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ నిర్ణయం ఉద్యోగుల భవిష్యత్తుపై కూడా ప్రభావం చూపే అవకాశముందని పేర్కొన్నారు. యాష్ నిర్వహణ, బొగ్గు నిర్వహణ వంటి కీలక కార్యకలాపాలు విద్యుత్ ఉత్పత్తిలో ప్రధాన పాత్ర పోషిస్తాయని, వాటిని ప్రైవేటు చేతుల్లో పెట్టడం సరైన నిర్ణయం కాదని అభిప్రాయపడ్డారు. ప్రైవేటీకరణ వల్ల ఖర్చులు పెరగడంతో పాటు నాణ్యత, భద్రతా ప్రమాణాలపై కూడా ప్రభావం పడే ప్రమాదం ఉందని తెలిపారు. ప్రస్తుతం యాదాద్రి విద్యుత్ కేంద్రంతో ప్రారంభమైన ఈ ప్రక్రియ భవిష్యత్తులో రాష్ట్రంలోని ఇతర విద్యుత్ కేంద్రాలకు కూడా విస్తరించే అవకాశం ఉందని ఉద్యోగ సంఘాలు హెచ్చరించాయి. ఒకసారి ఈ విధానం అమల్లోకి వస్తే విద్యుత్ రంగంలో మరిన్ని విభాగాలు కూడా ప్రైవేటీకరణ బాట పట్టే ప్రమాదం ఉందని పేర్కొన్నాయి. విద్యుత్ ఉత్పత్తి, సరఫరా వ్యవస్థలను క్రమంగా ప్రైవేటు రంగానికి అప్పగించే ప్రయత్నాల్లో భాగంగానే ఈ చర్యలను చూస్తున్నామని ఇంజనీర్లు ఆరోపించారు. ప్రభుత్వ రంగ విద్యుత్ సంస్థల పరిరక్షణ కోసం ఉద్యోగులు, ఇంజనీర్లు ఐక్యంగా పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు. ప్రభుత్వం వెంటనే టెండర్ల ప్రక్రియను నిలిపివేసి ఉద్యోగ సంఘాలతో చర్చలు జరపాలని డిమాండ్ చేశారు. తమ ఆందోళనలను పట్టించుకోకపోతే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. రాష్ట్రవ్యాప్తంగా విద్యుత్ రంగ ఉద్యోగులను కలుపుకొని విస్తృత స్థాయిలో పోరాట కార్యాచరణ చేపడతామని ప్రకటించారు.



# రెండు కార్లు ఢీ.. ముగ్గురు మృతి

నల్గొండ, జూన్ 19

నల్గొండ జిల్లాలో శుక్రవారం ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. పెద్దావూర మండలంలోని రామన్నగూడెం వద్ద ఎదురెదురుగా వస్తున్న రెండు కార్లు ఢీకొనడంతో ముగ్గురు అక్కడికక్కడే మృతి చెందారు. మరో ముగ్గురు తీవ్రంగా గాయపడినట్లు పోలీసులు తెలిపారు. ఈ ఘటనతో ప్రాంతంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. సమాచారం అందుకున్న వెంటనే పోలీసులు, అత్యవసర సహాయక బృందాలు ఘటనాస్థలికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టాయి. ప్రమాద తీవ్రతకు రెండు కార్లు పూర్తిగా ధ్వంసమయ్యాయి. వాహనాల్లో చిక్కుకున్న వారిని స్థానికుల సహాయంతో బయటకు తీశారు. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన ముగ్గురిని వెంటనే నాగార్జునసాగర్ ప్రాంతీయ ఆసుపత్రికి తరలించారు. అక్కడ వారికి వైద్యులు చికిత్స అందిస్తున్నారు. గాయపడిన వారి పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. ప్రమాదానికి అతివేగమే కారణమై ఉండవచ్చని ప్రాథమికంగా భావిస్తున్నారు. అయితే ప్రమాదం ఎలా జరిగిందనే విషయంపై పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. వాహనాల వేగం, రహదారి పరిస్థితులు, ఇతర కారణాలపై వివరాలు సేకరిస్తున్నారు. మృతుల వివరాలు ఇంకా పూర్తిగా తెలియరాలేదు. కుటుంబ సభ్యులకు సమాచారం అందించినట్లు పోలీసులు తెలిపారు. మృతదేహాలను శవ పరీక్షల నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ ప్రమాదంతో రామన్నగూడెం పరిసర ప్రాంతాల్లో కొంతసేపు రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. పోలీసులు ట్రాఫిక్‌ను పునరుద్ధరించి పరిస్థితిని అదుపులోకి తీసుకొచ్చారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నారు.



# ధాన్యం నిల్వ వ్యవస్థ ఆధునికీకరణకు రాష్ట్రం సిద్ధం



హైదరాబాద్, జూన్ 19

రాష్ట్రంలో ధాన్యం నిల్వ వ్యవస్థను ఆధునికీకరించేందుకు ప్రభుత్వం కీలక చర్యలకు శ్రీకారం చుట్టింది. ప్రధాన వరి ఉత్పత్తి జిల్లాల్లో 20 ప్రాంతాలలో అత్యాధునిక ధాన్య గిడ్డంగులను ఏర్పాటు చేయాలని యోచిస్తున్నట్లు నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి వెల్లడించారు. ఈ గిడ్డంగుల ద్వారా ధాన్యం నిల్వ, రవాణా, పంపిణీ వ్యవస్థలను మరింత సమర్థవంతంగా నిర్వహించాలన్న లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు సాగుతోంది. ఈ ప్రతిపాదనపై ప్రముఖ ధాన్య నిల్వ, రవాణా సంస్థల ప్రతినిధులతో మంత్రి సమీక్ష నిర్వహించారు. తొలి దశలో 50 వేల మెట్రిక్ టన్నుల సామర్థ్యంతో గిడ్డంగుల ఏర్పాటు ప్రతిపాదించారు. ప్రస్తుతం అమలులో ఉన్న ధాన్యం కొనుగోలు, నిల్వ వ్యవస్థకు అదనంగా ఈ సదుపాయాలు పనిచేస్తాయని మంత్రి స్పష్టం చేశారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా కొత్త వ్యవస్థను అమలు చేయాలని అధికారులను ఆదేశించారు. స్వయం సహాయక సంఘాలు, గ్రామీణ పేదరిక నిర్మూలన కేంద్రాలు, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు ప్రస్తుతం నిర్వహిస్తున్న ధాన్యం కొనుగోలు కార్యక్రమాలు యథావిధిగా కొనసాగుతాయని మంత్రి తెలిపారు. కొత్త వ్యవస్థ వల్ల వారి పాత్ర తగ్గదని, మరింత బలోపేతం అవుతుందని పేర్కొన్నారు. రైతులకు సులభంగా సేవలు అందేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఆధునిక గిడ్డంగుల ద్వారా ధాన్యం స్వీకరణ నుంచి నిల్వ, పంపిణీ వరకు మొత్తం ప్రక్రియ యాంత్రీకరణ ద్వారా నిర్వహించబడనుంది. ధాన్యం నాణ్యత పరీక్షలు, తేమ కొలతలు, నిల్వ పరిస్థితుల పర్యవేక్షణ అన్నీ అంకీయ పద్ధతిలో జరగనున్నాయి. దీంతో మానవ శ్రమ అవసరం తగ్గడంతో పాటు నిల్వ నష్టాలు కూడా గణనీయంగా తగ్గే అవకాశం ఉందని అధికారులు వివరించారు. ధాన్య నిల్వ కేంద్రాల్లో ఉష్ణోగ్రత, తేమ స్థాయిలను నిరంతరం పర్యవేక్షించే ప్రత్యేక పరికరాలు ఏర్పాటు చేయనున్నారు. గాలి ప్రసరణ వ్యవస్థలు, కీటక నియంత్రణ చర్యల ద్వారా ధాన్యం నాణ్యతను దీర్ఘకాలం పాటు కాపాడే అవకాశం ఉంటుందని నిపుణులు వివరించారు. నిల్వ కేంద్రాల నుంచి ప్రజా పంపిణీ వ్యవస్థకు లేదా బహిరంగ మార్కెట్‌కు సరఫరా చేసే వరకు ధాన్యం నాణ్యతను పరిరక్షించే విధంగా వ్యవస్థను రూపొందిస్తున్నారు.

# ఫీజు బకాయిలు వెంటనే విడుదల చేయాలి

హైదరాబాద్, 19

పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయి లను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ ఉస్మానియా విశ్వవిద్యాలయం ఆర్ట్స్ కళాశాల ప్రాంగణంలో బీఆర్‌ఎస్వీ ఆధ్వర్యంలో పోస్టర్‌ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బీఆర్‌ఎస్వీ నాయకుడు తుంగ బాలు మాట్లాడుతూ విద్యార్థుల సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఆరోపించారు. ఫీజు బకాయిలు విడుదల కాకపోవడంతో వేలాది మంది విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆయన పేర్కొన్నారు. ఉన్నత విద్యను కొనసాగిస్తున్న పేద, మధ్యతరగతి కుటుంబాలకు చెందిన విద్యార్థులు ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్నారని అన్నారు. బకాయిల చెల్లింపులో జాప్యం కారణంగా విద్యార్థుల చదువులకు ఆటంకం కలుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. గత ముప్పై నెలలుగా రాష్ట్రంలో విద్యారంగం నిర్లక్ష్యానికి గురైందని తుంగ బాలు విమర్శించారు. ఒకప్పుడు దేశవ్యాప్తంగా గుర్తింపు పొందిన తెలంగాణ విద్యా వ్యవస్థ ప్రస్తుతం అనేక సమస్యలతో సతమతమవుతోందన్నారు. విద్యా సంస్థలకు అవసరమైన నిధుల విడుదలలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. పరీక్షల నిర్వహణలో పారదర్శకత, భద్రత, ప్రణాళిక లోపిస్తున్నాయని ఆయన పేర్కొన్నారు. విద్యార్థుల భవిష్యత్తును ప్రభావితం చేసే అంశాలపై ప్రభుత్వం తగిన శ్రద్ధ చూపడం లేదన్నారు. భవిష్యత్ తరాలను నిర్లక్ష్యం చేయడం అంటే రాష్ట్ర భవిష్యత్తునే నిర్లక్ష్యం చేయడమేనని వ్యాఖ్యానించారు. విద్యార్థుల సమస్యలు, ఫీజు బకాయిలు, విద్యారంగ పరిరక్షణ అంశాలపై వచ్చే నెల 22న హైదరాబాద్‌లో రాష్ట్ర స్థాయి విద్యార్థి సదస్సు నిర్వహించనున్నట్లు ప్రకటించారు. రాష్ట్ర నలుమూలల నుంచి విద్యార్థులు, విద్యార్థి నాయకులు, మేధావులు, విద్యావేత్తలు ఈ సదస్సుకు హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వం వెంటనే స్పందించి పెండింగ్‌లో ఉన్న ఫీజు బకాయిలను విడుదల చేయాలని బీఆర్‌ఎస్వీ డిమాండ్ చేసింది. విద్యార్థుల చదువులకు ఎలాంటి అంతరాయం కలగకుండా చర్యలు తీసుకోవాలని కోరింది. లేనిపక్షంలో రాష్ట్రవ్యాప్తంగా విద్యార్థులతో కలిసి ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించింది.






## ఘనంగా రాహుల్ జన్మదిన

# వేడుకలు

హైదరాబాద్, జూన్ 19

పార్లమెంట్ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ జన్మదినం సందర్భంగా హైదరాబాద్‌లో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ఘనంగా వేడుకలు నిర్వహించారు. నగరంలోని మంత్రుల నివాస సముదాయంలో జరిగిన కార్యక్రమంలో మంత్రి పొన్నం ప్రభాకర్ ఆధ్వర్యంలో జన్మదిన వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. రాహుల్ గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన అనంతరం కేక్ కట్ చేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. వేడుకల సందర్భంగా కాంగ్రెస్ శ్రేణుల్లో ఉత్సాహం కనిపించింది. ఈ సందర్భంగా పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ ప్రజాస్వామ్య విలువల పరిరక్షణ, సామాజిక న్యాయం కోసం రాహుల్ గాంధీ నిరంతరం కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. దేశ ప్రజల హక్కుల కోసం ఆయన చేస్తున్న పోరాటం యువతకు స్ఫూర్తిగా నిలుస్తోందని అన్నారు. రాహుల్ గాంధీ నాయకత్వంలో దేశంలో ప్రజాస్వామ్య వ్యవస్థ మరింత బలోపేతం కావాలని, ప్రజల సమస్యల పరిష్కారానికి ఆయన చేస్తున్న కృషి విజయవంతం కావాలని ఆకాంక్షించారు. ఆయురారోగ్యాలతో దీర్ఘకాలం ప్రజాసేవలో కొనసాగాలని కోరుతూ శుభాకాంక్షలు తెలిపారు.



## రూ.38 కోట్లతో నూతన

# ద్విమార్గ రహదారి

రంగారెడ్డి, జూన్ 19

రంగారెడ్డి జిల్లా కందుకూరు మండలంలోని లేమూరు గ్రామంలో రూ.38 కోట్ల అంచనా వ్యయంతో నిర్మించనున్న నూతన ద్విమార్గ రహదారి పనులకు శంకుస్థాపన జరిగింది. రాష్ట్ర రహదారులు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డితో కలిసి ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. లేమూరు నుంచి శ్రీశైలం జాతీయ రహదారి మీదుగా తిమ్మాపూర్ వరకు అగర్మియాగూడ మార్గం ద్వారా అనుసంధానం చేసేలా ఈ రహదారిని నిర్మించనున్నారు. సుమారు 14 కిలోమీటర్ల మేర చేపట్టనున్న ఈ పనులు పూర్తయితే పరిసర ప్రాంతాల ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యాలు అందుబాటులోకి రానున్నాయి. ఈ సందర్భంగా కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి మెరుగైన రహదారి వ్యవస్థ అత్యంత అవసరమని అన్నారు. రవాణా సౌకర్యాలు మెరుగుపడితే ప్రజల ప్రయాణ సమయం తగ్గడంతో పాటు వ్యాపార, వాణిజ్య కార్యకలాపాలు కూడా విస్తరిస్తాయని పేర్కొన్నారు.

## యూరియా కలిసిన నీరు తాగి

# పది ఆవుల మృతి

రంగారెడ్డి, జూన్ 19

రంగారెడ్డి జిల్లా కొత్తూర్ మండలంలోని కుమ్మరిగుడా గ్రామంలో విషాద ఘటన చోటు చేసుకుంది. యూరి యా కలిసిన నీటిని తాగి నట్లు అనుమానిస్తున్న పది ఆవులు మృతి చెందా యి. ఈ ఘటనతో గ్రామంలో తీవ్ర విషాద వాతావరణం నెలకొంది. ఒక్కసారిగా పది ఆవులు ప్రాణాలు కోల్పోవడంతో యజమాని కన్నీరుమున్నీరుగా విలపిస్తు న్నాడు. గ్రామ శివారులో ఉన్న పాకలో మేత మేసిన అనంతరం ఆవులు నీరు తాగినట్లు సమాచారం. కొద్దిసేపటికే ఒక్కొక్కటిగా కుప్పకూలడంతో యజమానులు ఆందోళనకు గురయ్యారు. పశువైద్యులను పిలిపించేలోపే పది ఆవులు మృతి చెందినట్లు స్థానికులు తెలిపారు. మృతిచెందిన పశువుల విలువ లక్షల రూపాయలు ఉంటుందని గ్రామస్తులు చెబుతున్నారు.



# గోల్డెన్ బూట్ రేసులో మెస్సీ, డేవిడ్ దూకుడు

**న్యూయార్క్, జూన్ 19**

ఫిఫా ప్రపంచకప్-2026 టోర్నమెంట్ ఉత్కంఠభరితంగా సాగుతుండగా, అత్యధిక గోల్స్ సాధించే ఆటగాడికి ప్రదానం చేసే ప్రతిష్ఠాత్మక గోల్డెన్ బూట్ అవార్డు కోసం పోటీ ఆసక్తికరంగా మారింది. ప్రస్తుతం అర్జెంటీనా దిగ్గజం లియోనెల్ మెస్సీ, కెనడా స్టార్ జోనాథన్ డేవిడ్ ఈ రేసులో ముందంజలో కొనసాగు తున్నారు. ఆరో ప్రపంచకప్ ఆడుతున్న మెస్సీ, అల్జీరియా తో జరిగిన తొలి మ్యాచ్‌లోనే హ్యాట్రిక్ గోల్స్ నమోదు చేసి తన సత్తా చాటాడు. ప్రపంచకప్ చరిత్రలో ఇప్పటివరకు మొత్తం 16 గోల్స్ సాధించిన అతడు, అత్యధిక గోల్స్ చేసిన ఆటగాడిగా నిలిచిన జర్మనీ మాజీ దిగ్గజం మిరో స్లావ్ క్లోసే రికార్డును సమం చేశాడు. మరోవైపు సహ ఆతిథ్య దేశమైన కెనడా తరఫున ఆడుతున్న జోనాథన్ డేవిడ్ కూడా ఖతార్‌పై జరిగిన మ్యాచ్‌లో హ్యాట్రిక్ గోల్స్ సాధించి గోల్డెన్ బూట్ పోటీలో బలమైన అభ్యర్థిగా నిలిచాడు. అతడి



అద్భుత ప్రదర్శనతో కెనడా జట్టు కూడా నాకౌట్ అవకాశాలను బలపరుచుకుంది. ఇప్పటికీ టోర్నమెంట్ గ్రూప్ దశలోనే కొనసాగుతున్నందున గోల్డెన్ బూట్ కోసం పోటీ మరింత రసవత్తరంగా మారే అవకాశం ఉంది. ఫ్రాన్స్ స్టార్ కైలియన్ ఎంబాప్పే, నార్వే గోల్ మెషీన్ ఎర్లింగ్ హాలాండ్, ఇంగ్లండ్ కెప్టెన్ హ్యారీ కేన్ వంటి అగ్రశ్రేణి ఆటగాళ్లు కూడా ఈ రేసులో ఉన్నారు. ఇప్పటివరకు తొమ్మిది మంది ఆటగాళ్లు రెండేసి గోల్స్ సాధించి పోటీలో కొనసాగుతున్నారు. ఒకవేళ టోర్నమెంట్ ముగిసే సమయానికి ఇద్దరు లేదా అంతకంటే ఎక్కువ మంది ఆటగాళ్లు సమాన సంఖ్యలో గోల్స్ సాధిస్తే, గోల్డెన్ బూట్ విజేతను అసిస్టుల ఆధారంగా నిర్ణయిస్తారు. గోల్స్ సాధించడంలో సహకరించిన పాస్‌ల సంఖ్యను ఫిఫా సాంకేతిక కమిటీ పరిశీలించి అసిస్టుల గణాంకాలను ఖరారు చేస్తుంది. అసిస్టుల సంఖ్య కూడా సమానంగా ఉంటే, ఆ ఆటగాళ్లు టోర్నమెంట్‌లో ఆడిన మొత్తం నిమిషాలను పరిగణనలోకి తీసుకుంటారు. తక్కువ నిమిషాల్లో ఎక్కువ గోల్స్ చేసిన ఆటగాడికే ప్రాధాన్యం ఇస్తూ గోల్డెన్ బూట్ విజేతను ప్రకటిస్తారు. ప్రస్తుతం మెస్సీ, డేవిడ్ హ్యాట్రిక్‌లతో ముందంజలో ఉన్నప్పటికీ, టోర్నమెంట్ ఇంకా కీలక దశలకు చేరుకోకపోవడంతో గోల్డెన్ బూట్ కోసం పోటీ మరింత ఉత్కంఠభరితంగా మారనుందని క్రీడా విశ్లేషకులు భావిస్తున్నారు.

# ఖతార్‌పై కెనడా గోల్స్ వర్షం

**వాన్‌కోవర్, జూన్ 19**



ఫిఫా ప్రపంచకప్‌లో కెనడా జట్టు అద్భుత ప్రదర్శనతో తొలి విజయాన్ని నమోదు చేసింది. టోర్నమెంట్‌కు సహ ఆతిథ్య దేశంగా వ్యవహరిస్తున్న కెనడా, ఖతార్‌తో జరిగిన గ్రూప్-బి మ్యాచ్‌లో పూర్తి ఆధిపత్యం చెలాయిస్తూ 6-0 గోల్స్ తేడాతో ఘన విజయం సాధించింది. ఈ విజయంతో కెనడా ఖాతాలో నాలుగు పాయింట్లు చేరగా, నాకౌట్ దశకు చేరుకునే అవకాశాలను మరింత బలపరుచుకుంది. మ్యాచ్ ఆరంభం నుంచే దూకుడుగా ఆడిన కెనడా తరఫున సైల్ లారిన్ 16వ నిమిషంలో తొలి గోల్ చేసి జట్టుకు ఆధిక్యం అందించాడు. అనంతరం జోనాథన్ డేవిడ్ చెలరేగిపోయి ఖతార్ రక్షణను పూర్తిగా ఛేదించాడు. 29వ, 45వ, 90వ నిమిషాల్లో గోల్స్ సాధించి హ్యాట్రిక్ నమోదు చేశాడు. అతడి అద్భుత ఆటతీరుతో స్టేడియం మొత్తం సంబరాల్లో మునిగిపోయింది.

డేవిడ్‌తో పాటు సలిబా, మనాయ్ ఓజీ కూడా ఒక్కో గోల్ చేసి కెనడా విజయాన్ని మరింత భారీగా మార్చారు. స్వదేశీ మైదానంలో ప్రపంచకప్‌లో హ్యాట్రిక్ నమోదు చేసిన అరుదైన ఆటగాడిగా జోనాథన్ డేవిడ్ చరిత్ర సృష్టించాడు. గతంలో 1966 ప్రపంచకప్‌లో ఇంగ్లండ్ ఆటగాడు జెఫ్ హస్ట్ మాత్రమే స్వదేశంలో హ్యాట్రిక్ సాధించిన ఘనతను అందుకున్నాడు. అయితే భారీ విజయానందం మధ్య కెనడా జట్టుకు ఒక చేదు సంఘటన ఎదురైంది. మిడ్‌ఫీల్డర్ ఇస్మాయిల్ కోన్ తీవ్ర గాయానికి గురయ్యాడు. మ్యాచ్ మధ్యలో ఖతార్ ఆటగాడు ఆసిమ్ మడిబో చేసిన ప్రమాదకర టాకిల్ కారణంగా కోన్ ఎడమ కాలి ఎముక విరిగిపోయింది. తీవ్ర నొప్పితో మైదానంలో పడిపోయిన అతడిని వైద్య సిబ్బంది స్ట్రెచర్‌పై బయటకు తరలించారు. ఈ ఘటనను తీవ్రంగా పరిగణించిన రిఫరీ, ఖతార్ ఆటగాడు ఆసిమ్ మడిబోకు నేరుగా ఎరుపు కార్డు చూపించి మైదానం నుంచి పంపించారు. కోన్‌కు శస్త్రచికిత్స నిర్వహించనున్నట్లు వైద్యులు వెల్లడించారు. పూర్తిగా కోలుకోవడానికి కనీసం నాలుగు నెలల విశ్రాంతి అవసరమవుతుందని సమాచారం. ఒకవైపు ఘన విజయం సాధించిన ఆనందం, మరోవైపు కీలక ఆటగాడు గాయపడిన నిరాశ మధ్య కెనడా జట్టు తదుపరి మ్యాచ్‌ల కోసం సన్నద్ధమవుతోంది. అయితే జోనాథన్ డేవిడ్ హ్యాట్రిక్ ప్రదర్శనతో కెనడా జట్టు ప్రపంచకప్‌లో బలమైన పోటీదారుగా నిలిచిందనే అభిప్రాయం క్రీడా విశ్లేషకుల్లో వ్యక్తమవుతోంది.

# టెస్ట్ క్రికెట్‌కు పెద్దపీట.. పాకిస్థాన్ ఆటగాళ్లకు భారీ వేతనాలు

**లాహోర్, జూన్ 19**



వరుస వైఫల్యాలతో విమర్శలు ఎదుర్కొంటున్న పాకిస్థాన్ క్రికెట్ జట్టుకు ఊతమివ్వాలనే ఉద్దేశంతో పాకిస్థాన్ క్రికెట్ బోర్డు 2026-27 సీజన్‌కు సరికొత్త కాంట్రాక్ట్ విధానాన్ని ప్రకటించింది. ముఖ్యంగా టెస్ట్ క్రికెట్‌కు ప్రాధాన్యం పెంచుతూ ఆటగాళ్ల వేతనాలు, మ్యాచ్ ఫీజులను భారీగా పెంచింది. ఇప్పటి వరకు అమలులో ఉన్న సంప్రదాయ కేటగిరీల విధానాన్ని పూర్తిగా రద్దు చేసిన బోర్డు, వివిధ ఫార్మా ట్ల ఆధారంగా ఐదు ప్రత్యేక ట్రాక్‌లను ఏర్పాటు చేసింది. బోర్డు చైర్మన్ మొహసిన్ నఖ్వీ ఈ కొత్త విధానాన్ని ప్రకటిస్తూ, టెస్ట్ క్రికెట్‌ను బలోపేతం చేయడమే ప్రధాన లక్ష్యమని తెలిపారు. కొత్త విధానం ప్రకారం కేవలం టెస్ట్ మ్యాచ్‌లు మాత్రమే ఆడే అత్యుత్తమ ఆటగాళ్లను అత్యున్నత విభాగమైన ట్రాక్-ఏలో చేర్చనున్నారు. ఈ విభాగంలో ఉన్న ఆటగాళ్లకు నెలకు సుమారు 40 లక్షల పాకిస్థానీ రూపాయల రిటైనర్ ఫీజు లభించనుంది. అంతేకాకుండా ఒక టెస్ట్ మ్యాచ్‌కు ఇప్పటి వరకు చెల్లిస్తున్న 8 లక్షల రూపాయల ఫీజును 15 లక్షలకు పెంచారు. టెస్ట్‌లు, వన్డేలు రెండూ ఆడే సీనియర్ ఆటగాళ్లను ట్రాక్-ఏబీ విభాగంలో చేర్చనున్నారు. ఈ కేటగిరీలో ఉన్నవారికి నెలకు గరిష్ఠంగా 50 లక్షల పాకిస్థానీ రూపాయల వరకు పారితోషికం అందనుంది. దీంతో కేవలం వార్షిక కాంట్రాక్ట్ ద్వారానే కొంతమంది ఆటగాళ్లు ఐదు కోట్ల రూపాయలకు పైగా ఆదాయం పొందే అవకాశం ఉంది. ప్రపంచవ్యాప్తంగా టీ20 లీగ్‌ల ప్రభావం పెరుగుతున్న నేపథ్యంలో ఆటగాళ్లు టెస్ట్ క్రికెట్‌ను విస్మరించకుండా ఉండేందుకు ఈ భారీ వేతన విధానాన్ని తీసుకొచ్చినట్లు బోర్డు వర్గాలు వెల్లడించాయి. అయితే ఈ ప్రయోజనాలు పొందాలంటే ఆటగాళ్లు తప్పనిసరిగా దేశవాళీ ప్రథమ శ్రేణి క్రికెట్‌లో పాల్గొనాలని స్పష్టం చేశారు. దేశవాళీ మ్యాచ్‌లకు దూరంగా ఉంటే కాంట్రాక్ట్‌లకు అర్హత ఉండదని హెచ్చరించారు. జట్టు విజయాలను ప్రోత్సహించేందుకు ప్రత్యేక బోనస్ విధానాన్ని కూడా ప్రవేశపెట్టారు. పాకిస్థాన్ జట్టు ఏదైనా అంతర్జాతీయ క్రికెట్ మండలి నిర్వహించే ప్రధాన టోర్నమెంట్‌ను గెలిస్తే ఆటగాళ్లకు మ్యాచ్ ఫీజుపై 500 శాతం అదనపు బోనస్ అందజేయనున్నారు. ఆసియా స్థాయి టోర్నమెంట్‌లలో విజయం సాధిస్తే 300 శాతం వరకు అదనపు బోనస్ చెల్లించనున్నారు. టెస్ట్ క్రికెట్‌కు మళ్లీ గౌరవం తీసుకురావడంతో పాటు యువ ఆటగాళ్లను దీర్ఘకాల ఫార్మాట్ వైపు ఆకర్షించేందుకు ఈ నిర్ణయాలు కీలకంగా మారనున్నాయని క్రికెట్ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

## గంభీర్‌పై శ్రీశాంత్ సంచలన
# విమర్శలు

**ముంబై, జూన్ 19**



భారత క్రికెట్ జట్టు ప్రధాన కోచ్ గౌతమ్ గంభీర్‌పై మాజీ వేగవంతమైన బౌలర్ ఎస్. శ్రీశాంత్ తీవ్ర విమర్శలు గుప్పించాడు. భారత జట్టుకు గంభీర్ వంటి కోచ్ అవసరం లేదని, మహేంద్ర సింగ్ ధోనీ తరహా మెంటార్ ఉంటే జట్టుకు మరింత ప్రయోజనం చేకూరుతుందని వ్యాఖ్యానించాడు. ఒక ఇంటర్వ్యూలో మాట్లాడిన శ్రీశాంత్, గంభీర్ కోచింగ్ శైలి ఆటగాళ్లపై అధిక ఒత్తిడి పెడుతోందని ఆరోపించాడు. ఆ ఒత్తిడి కారణంగానే ఇటీవల టెస్టు క్రికెట్‌లో భారత జట్టు ఆశించిన ఫలితాలు సాధించలేకపోయిందని పేర్కొన్నాడు. 2024లో న్యూజిలాండ్‌తో, 2025లో దక్షిణాఫ్రికాతో స్వదేశంలో జరిగిన టెస్టు సిరీస్‌లలో భారత్ పరాజయం పాలవడాన్ని ప్రస్తావిస్తూ, ఆ సమయంలో గంభీర్ కోచ్‌గా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారని గుర్తుచేశాడు. ఆటగాళ్లకు స్వేచ్ఛ ఇవ్వకుండా అనవసర ఒత్తిడి సృష్టించడం సరైన పద్ధతి కాదని అభిప్రాయపడ్డాడు. భారత జట్టుకు కోచ్ కంటే మెంటార్ అవసర మని శ్రీశాంత్ స్పష్టం చేశాడు. విజయాల్లో ఆట గాళ్లతో ఆనందాన్ని పంచు కోవడం, పరాజయాల్లో వా రికి మానసిక బలం ఇవ్వ డం ముఖ్యమని తెలిపాడు. ఓడిపోయిన వెంటనే విమర్శలు చేయడం లేదా ఒత్తిడి పెంచడం కంటే ఆటగాళ్లకు సోదరుడిలా అండగా నిలవడం అవసరమని వ్యాఖ్యానించాడు. మహేంద్ర సింగ్ ధోనీ నాయకత్వాన్ని ఉదాహరణగా చూపిస్తూ, ఆయన ఎప్పుడూ ఆటగాళ్లపై అదనపు ఒత్తిడి మోపలేదని పేర్కొన్నాడు. అదే కారణంగా ధోనీ ఆటగాళ్లలో విశ్వాసాన్ని పెంచగలిగాడని వివరించాడు. ఇక 2026 టీ20 ప్రపంచకప్ విజయానికి సంబంధించిన చర్చలో కూడా శ్రీశాంత్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. ప్రపంచకప్ విజయానికి పూర్తి ఘనత గంభీర్‌కే ఇవ్వడం సరైనది కాదని అన్నాడు.

# దక్షిణ కొరియాపై మెక్సికో విజయం.. నాకౌట్‌లోకి ప్రవేశం

**మెక్సికో సిటీ, జూన్ 19**



ఫిఫా ప్రపంచకప్‌లో సహ ఆతిథ్య దేశమైన మెక్సికో జట్టు నాకౌట్ దశకు అర్హత సాధించింది. గ్రూప్-ఏలో భాగంగా దక్షిణ కొరియాతో జరిగిన కీలక పోరులో 1-0 గోల్ తేడాతో విజయం సాధించిన మెక్సికో, రౌండ్-32లోకి ప్రవేశించింది. ఈ విజయంతో ఆ జట్టు ఖాతాలో ఆరు పాయింట్లు చేరాయి. గ్వాడలహారాలో జరిగిన ఈ మ్యాచ్‌లో ఇరు జట్లు తొలి అర్ధభాగంలో గోల్స్ చేయడంలో విఫలమయ్యాయి. అయితే రెండో అర్ధభాగం ప్రారంభమైన కొద్దిసేపటికే మెక్సికోకు కీలక గోల్ లభించింది. 50వ నిమిషంలో లూయిస్ రోమో ప్రత్యర్థి రక్షణలో జరిగిన పొరపాటును సద్వినియోగం చేసుకుని బంతిని గోల్‌పోస్ట్‌లోకి పంపించాడు. దక్షిణ కొరియా గోల్‌కీపర్ కిమ్ సెంగ్ యూ బంతిని అందుకున్న సమయంలో తన సహచర ఆటగాడితో ఢీకొనడంతో బంతిపై నియంత్రణ కోల్పోయాడు. ఆ అవకాశాన్ని గమనించిన రోమో వేగంగా స్పందించి గోల్ నమోదు చేశాడు. చివరకు అదే గోల్ మ్యాచ్ ఫలితాన్ని నిర్ణయించింది. ఆట చివరి దశలో దక్షిణ కొరియాకు సమం చేసే అవకాశం వచ్చినప్పటికీ దాన్ని ఉపయోగించుకోలేకపోయింది. 87వ నిమిషంలో చో గు సంగ్‌కు గోల్ చేసే అవకాశం దక్కగా, మెక్సికో గోల్‌కీపర్ రౌల్ రంగేల్ అద్భుతంగా అడ్డుకుని జట్టును గట్టెక్కించాడు. స్వదేశీ మైదానంలో అభిమానుల భారీ మద్దతుతో ఆడిన మెక్సికో జట్టు మరో గోల్ చేసే అవకాశాన్ని కూడా సృష్టించింది. 75వ నిమిషంలో వచ్చిన ఆ అవకాశం తృటిలో చేజారిపోవడంతో స్కోరు 1-0 వద్దే నిలిచిపోయింది. ఓటమి పాలైనప్పటికీ దక్షిణ కొరియా జట్టుకు ఇంకా నాకౌట్ అవకాశాలు పూర్తిగా ముగియలేదు. తొలి మ్యాచ్‌లో చెక్ రిపబ్లిక్‌పై విజయం సాధించిన ఆ జట్టు ప్రస్తుతం గ్రూప్‌లో పోటీలోనే ఉంది. తదుపరి మ్యాచ్‌లో దక్షిణాఫ్రికాతో తలపడనుండగా, మెక్సికో చెక్ రిపబ్లిక్‌తో పోటీ పడనుంది. మెక్సికో వరుస విజయాలతో గ్రూప్-ఏలో అగ్రస్థానాన్ని బలపరుచుకుంటూ నాకౌట్ దశకు చేరగా, దక్షిణ కొరియా మాత్రం తదుపరి మ్యాచ్‌లో విజయం కోసం సమష్టిగా పోరాడాల్సిన పరిస్థితి ఏర్పడింది.




## భారత జట్టులోకి హర్షిత్ రాణా
# పునరాగమనం

**చెన్నై, జూన్ 19**

గాయం కారణంగా గత కొంతకాలంగా క్రికెట్‌కు దూరమైన యువ ఫాస్ట్ బౌలర్, ఆల్‌రౌండర్ హర్షిత్ రాణా తిరిగి భారత జట్టులో చోటు దక్కించుకున్నాడు. అఫ్ఘనిస్తాన్‌తో చెన్నై వేదికగా జరగనున్న మూడో వన్డే మ్యాచ్‌కు అతడిని ఎంపిక చేసినట్లు భారత క్రికెట్ నియంత్రణ మండలి వెల్లడించింది. ఈ ఏడాది ప్రారంభంలో జరిగిన టీ20 ప్రపంచకప్ సన్నాహక మ్యాచ్ సందర్భంగా హర్షిత్ రాణా మోకాలికి తీవ్ర గాయం అయింది. ఆ గాయం కారణంగా అతడు ప్రపంచకప్ టోర్నమెంట్ మొత్తానికి దూరమవడమే కాకుండా 2026 ఇండియన్ ప్రీమియర్ లీగ్ సీజన్‌లో కూడా ఆడలేకపోయాడు. అనంతరం బెంగళూరులోని భారత క్రికెట్ నియంత్రణ మండలి అత్యున్నత శిక్షణ కేంద్రంలో చికిత్స, పునరావాస కార్యక్రమాలు పూర్తి చేసి పూర్తిస్థాయి ఫిట్‌నెస్‌ను సాధించాడు. అఫ్ఘనిస్తాన్‌తో జరుగుతున్న మూడు వన్డేల సిరీస్‌లో భారత్ ఇప్పటికే 2-0తో ఆధిక్యంలో నిలిచి సిరీస్‌ను కైవసం చేసుకుంది. దీంతో చివరి మ్యాచ్‌లో యువ ఆటగాళ్లకు అవకాశాలు కల్పించే దిశగా జట్టు యాజమాన్యం ఆలోచిస్తోంది. రాబోయే ఐర్లాండ్, ఇంగ్లాండ్ పర్యటనలను దృష్టిలో ఉంచుకుని హర్షిత్ రాణా ఫిట్‌నెస్‌ను పరీక్షించేందుకు ఈ మ్యాచ్‌ను కీలకంగా భావిస్తున్నారు. హర్షిత్ రాణా తిరిగి జట్టులో చేరడం భారత బౌలింగ్ విభాగానికి అదనపు బలంగా మారనుంది. వేగంతో పాటు బ్యాటింగ్‌లో కూడా ఉపయోగపడగల సామర్థ్యం ఉన్న అతడిపై జట్టు యాజమాన్యం మంచి ఆశలు పెట్టుకుంది.




## మరో నాలుగేళ్లు ఆర్‌సీబీకే
# కోహ్లీ సేవలు

**బెంగళూరు, జూన్ 19**

ఇండియన్ ప్రీమియర్ లీగ్ చరిత్రలో విరాట్ కోహ్లీ, రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు మధ్య ఉన్న అనుబంధం ప్రత్యేకమైనది. 2008లో లీగ్ ప్రారంభమైనప్పటి నుంచి నేటి వరకు ఒకే ఫ్రాంచైజీ తరఫున ఆడుతూ వస్తున్న ఏకైక ఆటగాడిగా కోహ్లీ అరుదైన గుర్తింపు సంపాదించాడు. జట్టు మారే ఆలోచన తనకు ఎప్పుడూ లేదని, ఐపీఎల్ కెరీర్ మొత్తాన్ని బెంగళూరు జట్టుతోనే పూర్తి చేయాలనేది తన సంకల్పమని కోహ్లీ పలుమార్లు వెల్లడించాడు. ఇటీవల వరుసగా రెండు సీజన్లలో ఐపీఎల్ టైటిల్‌ను గెలుచుకుని బెంగళూరు జట్టు తమ సుదీర్ఘ నిరీక్షణకు ముగింపు పలికింది. ఈ విజయాల్లో కోహ్లీ కీలక పాత్ర పోషించాడు. దీంతో అభిమానుల్లో అతనిపై మరింత అభిమానం పెరిగింది. ఈ నేపథ్యంలో బెంగళూరు జట్టు ప్రధాన కార్యనిర్వాహక అధికారి రాజేశ్ మీనన్ కోహ్లీ భవిష్యత్తుపై ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. కోహ్లీ మరో మూడు నుంచి నాలుగు సంవత్సరాల పాటు ఐపీఎల్‌లో బెంగళూరు జట్టుకే ప్రాతినిధ్యం వహిస్తాడని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు. కోహ్లీ ఇప్పటికీ అత్యుత్తమ శారీరక దారుఢ్యంతో ఉన్నాడని, ఆట పట్ల అతనిలో ఉన్న అంకితభావం ఏమాత్రం తగ్గలేదని రాజేశ్ మీనన్ పేర్కొన్నారు. ఇటీవల ముగిసిన సీజన్‌లో కోహ్లీ ప్రదర్శించిన ఉత్సాహం, పట్టుదల చూస్తే అతడు మరికొన్ని సంవత్సరాలు అత్యున్నత స్థాయిలో క్రికెట్ ఆడగలడని తెలిపారు. రిటైర్మెంట్ అనంతరం కూడా కోహ్లీ బెంగళూరు ఫ్రాంచైజీతో అనుబంధాన్ని కొనసాగిస్తాడని ఆయన వెల్లడించారు. జట్టుకు మార్గదర్శకుడిగా, యువ ఆటగాళ్లకు ప్రేరణగా అతని సేవలు భవిష్యత్తులో కూడా ఉపయోగపడతాయని చెప్పారు. అనుభవం, స్థిరత్వం, నాయకత్వ లక్షణాలు కలిగిన కోహ్లీ వంటి ఆటగాడు ఏ జట్టుకైనా అమూల్యమైన ఆస్తి అని రాజేశ్ మీనన్ అభిప్రాయపడ్డారు. బెంగళూరు జట్టు విజయ ప్రయాణంలో కోహ్లీ పాత్ర మరికొన్ని సంవత్సరాలు కొనసాగనుండటంతో అభిమానులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.




## పీఎఫ్ ఖాతాదారులకు శుభవార్త..
# ఈ నెలలోనే వడ్డీ జమ

**న్యూఢిల్లీ, జూన్ 19**

ఉద్యోగుల భవిష్యనిధి సంస్థ (ఈపీఎఫ్ఓ) దేశవ్యాప్తంగా ఉన్న కోట్లాది మంది పీఎఫ్ ఖాతాదారులకు గుడ్‌న్యూస్ చెప్పింది. 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన పీఎఫ్ వడ్డీ జమ ప్రక్రియను ఈ నెలలోనే పూర్తి చేసేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు సమాచారం. దీంతో తమ ఖాతాల్లో వడ్డీ జమ కోసం ఎదురుచూస్తున్న ఉద్యోగులకు ఊరట లభించనుంది. పీఎఫ్ ఖాతాల్లో వడ్డీ మొత్తం నేరుగా జమ కానుండటంతో ఉద్యోగుల రిటైర్మెంట్ పొదుపు మరింత పెరగనుంది. వడ్డీ జమ అయిన తర్వాత ఖాతాదారులు తమ పాస్‌బుక్‌లో పెరిగిన బ్యాలెన్స్‌ను చూడవచ్చు. ఈ ప్రక్రియ పూర్తయిన వెంటనే సంబంధిత ఖాతాల్లో మొత్తం అప్డేట్ అవుతుంది. ఖాతాదారులు తమ పీఎఫ్ ఖాతాలో వడ్డీ జమ అయిందో లేదో ఆన్‌లైన్‌లో సులభంగా తెలుసుకోవచ్చు. ఈపీఎఫ్ఓ అధికారిక పోర్టల్, ఉమాంగ్ యాప్ లేదా మిస్డ్ కాల్ సేవ ద్వారా ఖాతా వివరాలను పరిశీలించవచ్చు. యూఏఎన్ నంబర్ యాక్టివ్‌గా ఉండటం, మొబైల్ నంబర్ ఖాతాతో అనుసంధానం అయి ఉండటం అవసరం. ప్రభుత్వం నిర్ణయించిన వార్షిక వడ్డీ రేటు ప్రకారం ఈపీఎఫ్ఓ ఆటోమేటిక్‌గా వడ్డీని లెక్కించి ఖాతాల్లో జమ చేస్తుంది. ఇందుకోసం ఖాతాదారులు ప్రత్యేకంగా ఎలాంటి దరఖాస్తు చేయాల్సిన అవసరం లేదు. సాంకేతిక కారణాల వల్ల కొంతమందికి వడ్డీ జమలో స్వల్ప ఆలస్యం జరిగే అవకాశం ఉన్నప్పటికీ, అర్హులైన అందరికీ వడ్డీ అందుతుందని అధికారులు స్పష్టం చేస్తున్నారు. పీఎఫ్ ఖాతాదారులు తమ ఖాతా వివరాలను ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ ఈపీఎఫ్ఓ నుంచి వచ్చే అధికారిక ప్రకటనలను గమనించాలని నిపుణులు సూచిస్తున్నారు. ఈ నెలాఖరులోగా వడ్డీ జమ ప్రక్రియ పూర్తయ్యే అవకాశముందని తెలుస్తోంది.




## ఉద్యోగాలను కాదు..
# అవకాశాలను పెంచుతుంది

**పారిస్, జూన్ 19**

కృత్రిమ మేధ ప్రభావంతో ప్రపంచవ్యాప్తంగా ఉద్యోగాల భవిష్యత్తుపై చర్చలు జోరుగా సాగుతున్న వేళ ప్రముఖ వ్యాపారవేత్త జెఫ్ బెజోస్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. కృత్రిమ మేధ కారణంగా ఉద్యోగాలు అంతరించిపోతాయనే భయాలు అతిశయోక్తి మాత్రమేనని, వాస్తవానికి ఈ సాంకేతికత భవిష్యత్తులో మరిన్ని ఉద్యోగ అవకాశాలను సృష్టిస్తుందని ఆయన అభిప్రాయపడ్డారు. పారిస్‌లో నిర్వహించిన సాంకేతిక సదస్సులో మాట్లాడిన బెజోస్, కృత్రిమ మేధ మనుషులను భర్తీ చేయడానికి రాలేదని, వారి సామర్థ్యాలను మరింత పెంచేందుకు వచ్చిందని తెలిపారు. ఈ సాంకేతికత ద్వారా ఉద్యోగులు తమ పనులను మరింత వేగంగా, సమర్థవంతంగా నిర్వహించగలరని చెప్పారు. ఇప్పటివరకు సమయం, వనరులు లేదా సాంకేతిక పరిమితుల కారణంగా సాధ్యం కాని అనేక పనులను భవిష్యత్తులో సులభంగా చేయగల పరిస్థితి ఏర్పడుతుందని వివరించారు. ప్రపంచంలో ఇప్పటికీ పరిష్కారం కోసం ఎదురుచూస్తున్న అనేక సమస్యలు ఉన్నాయని, వాటికి కొత్త పరిష్కారాలను కనుగొనే శక్తి కృత్రిమ మేధకు ఉందని ఆయన అన్నారు. ప్రజల ఉత్పాదకత పెరిగిన కొద్దీ కొత్త పరిశ్రమలు, కొత్త వ్యాపార రంగాలు, కొత్త సేవలు వెలుగులోకి వస్తాయని పేర్కొన్నారు. అలాంటి పరిణామాలు కొత్త రకాల ఉద్యోగాలకు దారితీస్తాయని, ఉపాధి అవకాశాలను మరింత విస్తరింపజేస్తాయని చెప్పారు. అయితే మరోవైపు కృత్రిమ మేధపై ఆందోళనలు కూడా కొనసాగుతున్నాయి. ఇటీవల నిర్వహించిన పలు సర్వేల్లో గణనీయ సంఖ్యలో ప్రజలు తమ ఉద్యోగాలు భవిష్యత్తులో ప్రమాదంలో పడతాయనే భయాన్ని వ్యక్తం చేసినట్లు వెల్లడైంది. అనేక సంస్థలు ఖర్చులను తగ్గించుకోవడం, పనితీరును మెరుగుపరచడం కోసం కృత్రిమ మేధ ఆధారిత వ్యవస్థలను వినియోగించడం ప్రారంభించాయి. దీంతో ఉద్యోగులలో అనిశ్చితి నెలకొంది. ఈ నేపథ్యంలో స్పందించిన బెజోస్, గతంలో పారిశ్రామిక విప్లవం వచ్చినప్పుడు కూడా ఇలాంటి భయాలే వ్యక్తమయ్యాయని గుర్తు చేశారు. ప్రారంభ దశలో మార్పులు కొంత ఒత్తిడిని సృష్టించినప్పటికీ, తర్వాత కాలంలో కొత్త పరిశ్రమలు పుట్టుకొచ్చి లక్షలాది మందికి ఉపాధి కల్పించాయని అన్నారు. అదే విధంగా కృత్రిమ మేధ కూడా తొలుత సవాళ్లను తీసుకొచ్చినా, దీర్ఘకాలంలో ఆర్థిక వృద్ధికి, ఉపాధి విస్తరణకు కారణమవుతుందని విశ్వాసం వ్యక్తం చేశారు.

# భారీగా పడిపోయిన బంగారం ధరలు..



**హైదరాబాద్, జూన్ 19**

దేశీయ బంగారం మార్కెట్‌లో నేడు భారీ పతనం నమోదైంది. అంతర్జాతీయ మార్కెట్‌లో ముడి బంగారం ధరలు తగ్గుముఖం పట్టడంతో దేశవ్యాప్తంగా పసిడి ధరలు గణనీయంగా క్షీణించాయి. అమెరికా కేంద్ర బ్యాంకు వడ్డీ రేట్ల కోతపై అనిశ్చితి నెలకొనడం, డాలర్ విలువ బలపడటం వంటి కారణాలతో బంగారం ధరలపై ఒత్తిడి పెరిగినట్లు మార్కెట్ వర్గాలు పేర్కొంటున్నాయి. దేశీయ మార్కెట్‌లో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర సగటున రూ.3,650 మేర తగ్గగా, 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.3,350 మేర పతనమైంది. దీంతో ఇటీవల వరుసగా పెరుగుతూ వచ్చిన బంగారం ధరలకు కాస్త బ్రేక్ పడింది. హైదరాబాద్‌లో ఉదయం మార్కెట్ ప్రారంభ సమయానికి 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,45,860గా నమోదైంది. 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,33,700గా ఉండగా, 18 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,09,390గా ఉంది. తెలంగాణలోని వరంగల్, నిజామాబాద్, ఖమ్మం వంటి ప్రధాన నగరాల్లో కూడా ఇదే ధరలు కొనసాగుతున్నాయి. ఆంధ్రప్రదేశ్‌లో విజయవాడ, విశాఖ పట్నం, గుంటూరు, నెల్లూరు, తిరుపతి నగరాల్లోనూ బంగారం ధరలు సమానంగానే నమోదయ్యాయి. దేశంలోని ప్రధాన నగరాల విషయానికి వస్తే, చెన్నైలో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,48,040గా ఉండగా, న్యూఢిల్లీలో రూ.1,46,010గా నమోదైంది. ముంబై, కోల్‌కతా, బెంగళూరు, పుణె నగరాల్లో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,45,860గా ఉంది.

# ఐటీ షేర్లలో భారీ పతనం..


**రూ.1.35 లక్షల కోట్ల సంపద ఆవిరి**




**ముంబై, జూన్ 19**

దేశీయ ఐటీ రంగం శుక్రవారం భారీ ఒత్తిడిని ఎదుర్కొంది. అంతర్జాతీయ సాంకేతిక సేవల సంస్థ యాక్సెంచర్ విడుదల చేసిన తాజా ఆదాయ అంచనాల ప్రభావంతో భారత ఐటీ కంపెనీల షేర్లు ఒక్కసారిగా కుప్పకూలాయి. దీంతో పెట్టుబడిదారుల సంపదలో సుమారు రూ.1.35 లక్షల కోట్ల మేర నష్టం నమోదైనట్లు మార్కెట్ వర్గాలు పేర్కొన్నాయి. కృత్రిమ మేధ ప్రభావంతో భవిష్యత్తులో సమాచార సాంకేతిక సేవల రంగంలో వృద్ధి మందగించే అవకాశం ఉందని యాక్సెంచర్ తన నివేదికలో సూచించింది. ఈ ప్రకటనతో పెట్టుబడిదారుల్లో ఆందోళన నెలకొని, ఐటీ రంగ షేర్లలో భారీ అమ్మకాలు చోటుచేసుకున్నాయి. మార్కెట్ ట్రేడింగ్‌లో ప్రముఖ ఐటీ సంస్థల షేర్లు తీవ్రంగా పతనమయ్యాయి. ఇన్ఫోసిస్ షేర్లు 8.59 శాతం తగ్గగా, టెక్ మహీంద్రా షేర్లు 7 శాతం క్షీణించాయి. టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ షేర్లు 6.52 శాతం, హెచ్‌సీఎల్ టెక్నాలజీస్ షేర్లు 6 శాతం, విప్రో షేర్లు 4.29 శాతం మేర పడిపోయాయి. భారత ఐటీ సంస్థలు అంతర్జాతీయ ప్రాజెక్టులు, సాంకేతిక సేవల విస్తరణలో విదేశీ మార్కెట్లపై అధికంగా ఆధార పడుతున్న నేపథ్యంలో యాక్సెంచర్ అంచనాలు నేరుగా ప్రభావం చూపినట్లు విశ్లేషకులు భావిస్తున్నారు. ముఖ్యంగా కృత్రిమ మేధ సాంకేతికత వేగంగా విస్తరిస్తుండటంతో సంప్రదాయ ఐటీ సేవల డిమాండ్‌పై అనిశ్చితి నెలకొన్నట్లు మార్కెట్ నిపుణులు చెబుతున్నారు.

## ఫోన్‌పే వాలెట్
## వినియోగదారులకు కొత్త
# నిబంధనలు




**న్యూఢిల్లీ, జూన్ 19**

జిటల్ చెల్లింపుల వేదికగా విస్తృతంగా ఉపయోగిస్తున్న ఫోన్‌పే తమ వాలెట్ వినియోగదారుల కోసం కొత్త నిబంధనలను అమలు చేయనున్నట్లు ప్రకటించింది. చాలా కాలంగా వాడకుండా ఉన్న వాలెట్ ఖాతాలపై నిర్వహణ రుసుము విధించేందుకు సంస్థ నిర్ణయం తీసుకుంది. ఈ నిర్ణయం లక్షలాది మంది వినియోగదారులపై ప్రభావం చూపే అవకాశం ఉంది. ఫోన్‌పే వాలెట్‌ను యాక్టివేట్ చేసుకున్న తర్వాత చాలా మంది దానిని తరచుగా ఉపయోగించరు. కొందరు వినియోగదారులు సంవత్సరాల తరబడి ఎలాంటి లావాదేవీలు చేయకుండా వాలెట్‌ను అలాగే ఉంచేస్తున్నారు. ఇలాంటి నిష్క్రియ ఖాతాలను నిర్వహించడానికి అదనపు ఖర్చు అవుతోందని సంస్థ భావిస్తోంది. ఈ నేపథ్యంలో ఇనాక్టివ్ వాలెట్లపై ప్రత్యేక నిర్వహణ రుసుము వసూలు చేయాలని నిర్ణయించింది. కొత్త నిబంధనల ప్రకారం వరుసగా 365 రోజుల పాటు వాలెట్ ద్వారా ఎలాంటి ఆర్థిక లావాదేవీలు జరపని ఖాతాలను నిష్క్రియ ఖాతాలుగా పరిగణిస్తారు. అలాంటి వాలెట్లకు ప్రతి మూడు నెలలకు ఒకసారి రూ.100తో పాటు వర్తించే పన్నులను కలిపి నిర్వహణ రుసుము విధించనున్నారు. వాలెట్‌లో రూ.100 లేదా అంతకంటే ఎక్కువ మొత్తం అందుబాటులో ఉంటే ఆ మొత్తాన్ని నేరుగా కట్ చేసుకుంటారు. ఒకవేళ వాలెట్‌లో రూ.100 కంటే తక్కువ మొత్తం ఉంటే అందుబాటులో ఉన్న మొత్తం మొత్తాన్నే రుసుముగా తీసుకుంటారు. ఈ ప్రక్రియ గురించి వినియోగదారులకు ముందుగానే సమాచారాన్ని అందించనున్నట్లు సంస్థ తెలిపింది. అయితే ఈ రుసుము నుంచి తప్పించుకోవడం చాలా సులభం. వాలెట్‌ను పూర్తిగా ఖాళీ చేయాల్సిన అవసరం లేదు. ఏడాదిలో కనీసం ఒకసారి అయినా వాలెట్ ద్వారా చెల్లింపు చేయడం, నగదు బదిలీ చేయడం లేదా ఇతర లావాదేవీలు నిర్వహించడం ద్వారా ఖాతాను క్రియాశీలంగా ఉంచుకోవచ్చు. అలా చేస్తే ఎలాంటి నిర్వహణ రుసుము వర్తించదు. ఫోన్‌పే వాలెట్ సేవలను వినియోగించే వారు తమ ఖాతా స్థితిని ఎప్పటికప్పుడు పరిశీలించుకోవాలని, ఎక్కువ కాలం ఉపయోగించకపోతే నిర్వహణ రుసుము పడే అవకాశం ఉందని నిపుణులు సూచిస్తున్నారు. ముఖ్యంగా వాలెట్‌లో నిల్వగా డబ్బు ఉంచి మరిచిపోయే వినియోగదారులు ఈ కొత్త నిబంధనలను గమనించడం అవసరమని చెబుతున్నారు. డిజిటల్ చెల్లింపుల రంగంలో వినియోగదారుల భద్రత, ఖాతాల నిర్వహణ, సేవల సామర్థ్యాన్ని మెరుగు పరచడంలో భాగంగానే ఈ నిర్ణయం తీసుకున్నట్లు సంస్థ వర్గాలు పేర్కొంటున్నాయి. దీంతో ఇకపై ఫోన్‌పే వాలెట్ కలిగిన వినియోగదారులు తమ ఖాతాలను క్రమం తప్పకుండా ఉపయోగించాల్సిన అవసరం ఏర్పడింది.

# కొత్త రూపంలో పల్సర్ 220ఎఫ్

**న్యూఢిల్లీ, జూన్ 19**

ద్విచక్ర వాహన ప్రియులు ఎంతోకాలంగా ఎదురుచూస్తున్న సరికొత్త మార్పులతో పల్సర్ 220ఎఫ్ మళ్లీ మార్కెట్లో సందడి చేస్తోంది. ఈసారి వాహనానికి మరింత శక్తివంతమైన కాంతిని అందించే ఆధునిక దీపాల వ్యవస్థను జోడించడం ద్వారా సంస్థ వినియోగదారులను ఆకట్టుకునే ప్రయత్నం చేసింది. గత ఏడాది చివర్లో రంగులు, గ్రాఫిక్స్, సూచిక దీపాల్లో మార్పులు చేసిన తర్వాత ఇప్పుడు మరో కీలకమైన అప్‌డేట్‌ను అందించింది. ఇప్పటివరకు ఈ వాహనంలో ఉపయోగించిన సాధారణ హాలోజన్ దీపం స్థానంలో అధునాతన కాంతి సాంకేతికతతో కూడిన దీప వ్యవస్థను అమర్చారు. దీనికి పగటిపూట కూడా స్పష్టంగా కనిపించే ప్రత్యేక కాంతి పట్టీలను జత చేశారు. అయితే వాహనానికి ప్రత్యేక గుర్తింపుగా నిలిచిన ముందు భాగ రూపకల్పన, అర్ధ కవరింగ్ ఆకృతి, శరీర నిర్మాణంలో ఎలాంటి మార్పులు చేయలేదు. దీంతో వాహనానికి ఉన్న సంప్రదాయ రూపం అలాగే కొనసాగుతూ ఆధునికతను సంతరించుకుంది. యాంత్రిక వ్యవస్థలో మాత్రం ఎలాంటి మార్పులు చేయలేదు. గతంలో ఉన్న శక్తివంతమైన ఇంజిన్‌ను అలాగే కొనసాగించారు. 220 ఘన సెంటీమీటర్ల సామర్థ్యం కలిగిన ఈ ఇంజిన్ మంచి పనితీరు అందిస్తూ ప్రయాణికులకు సౌకర్యవంతమైన అనుభూతిని ఇస్తోంది. నగర రహదారుల నుంచి జాతీయ రహదారుల వరకు అన్ని పరిస్థితుల్లోనూ సమర్థవంతంగా పనిచేసే విధంగా దీనిని రూపొందించారు. ఐదు దశల గేర్ వ్యవస్థతో కూడిన ఈ



వాహనం యువతలో ఇప్పటికీ మంచి ఆదరణ పొందుతోంది. కొత్త దీపాల వ్యవస్థ కారణంగా వాహనం ధరలో కూడా పెరుగుదల చోటుచేసుకుంది. గతంలో ఉన్న ధరతో పోలిస్తే సుమారు ఎనిమిది వేల రూపాయలు పెరిగింది. ప్రస్తుతం దేశ రాజధానిలో ఈ వాహనం ప్రాథమిక ధర లక్షా ముప్పై ఆరు వేల రూపాయలుగా నిర్ణయించారు. కొత్త సాంకేతిక సౌకర్యాలు జోడించినప్పటికీ ధరను అందుబాటులో ఉంచేందుకు సంస్థ ప్రయత్నించినట్లు తెలుస్తోంది. దాదాపు రెండు దశాబ్దాలుగా మార్కెట్లో కొనసాగుతున్న ఈ వాహనానికి ఇప్పటికీ విశేషమైన ఆదరణ ఉంది. కొత్త తరహా నమూనాలు మార్కెట్లోకి వచ్చినప్పటికీ పల్సర్ 220ఎఫ్‌కు ఉన్న ప్రత్యేక అభిమాన వర్గం ఏమాత్రం తగ్గలేదు.




## జియో భారీ ఐపీఓకు రంగం
## సిద్ధం మార్కెట్‌లోకి రానున్న
# టెలికాం దిగ్గజం

**ముంబై, జూన్ 19**

దేశంలోని అతిపెద్ద టెలికాం సంస్థలలో ఒకటైన జియో ఇన్ఫోకామ్ త్వరలో భారీ ఐపీఓతో స్టాక్ మార్కెట్‌లోకి అడుగుపెట్టనుంది. రిలయన్స్ ఇండస్ట్రీస్ వార్షిక సర్వసభ్య సమావేశంలో ముకేశ్ అంబానీ ఈ కీలక ప్రకటన చేశారు. జియో ప్లాట్‌ఫామ్స్ బోర్డు ఇప్పటికే ఐపీఓ ముసాయిదా పత్రాలకు ఆమోదం తెలిపిందని, వాటిని మార్కెట్ నియంత్రణ సంస్థ సెబీకి సమర్పిస్తున్నట్లు వెల్లడించారు. ఈ ఐపీఓ ద్వారా జియో సుమారు 4 బిలియన్ డాలర్లు, అంటే దాదాపు రూ.36,000 కోట్ల నుంచి రూ.40,000 కోట్ల వరకు సమీకరించాలని లక్ష్యంగా పెట్టుకుంది. దేశంలో డిజిటల్ సేవలు, 5జీ విస్తరణ, బ్రాడ్‌బ్యాండ్ కనెక్టివిటీ రంగాల్లో జియో కీలక పాత్ర పోషిస్తున్న నేపథ్యంలో ఈ ఐపీఓపై పెట్టుబడిదారుల్లో భారీ ఆసక్తి నెలకొంది. జియో స్టాక్ మార్కెట్‌లో లిస్టింగ్ అయితే భారత టెలికాం రంగంలో ఇది ఒక కీలక మైలురాయిగా నిలవనుంది. మరోవైపు జియో ప్లాట్‌ఫామ్స్ విలువను మరింత పెంచేందుకు సంస్థ డిజిటల్ సేవలు, కృత్రిమ మేధ, క్లౌడ్ సేవలు, 5జీ నెట్‌వర్క్ విస్తరణపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు సమాచారం. భవిష్యత్ సాంకేతిక రంగాల్లో ఆధిపత్యం సాధించేందుకు భారీ పెట్టుబడులు పెట్టాలని సంస్థ యోచిస్తోంది. జియో ఐపీఓ ప్రకటనతో దేశీయ పెట్టుబడిదారులు, మార్కెట్ వర్గాల్లో ఉత్సాహం నెలకొంది. సెబీ అనుమతుల అనంతరం ఐపీఓ షెడ్యూల్, ధరల శ్రేణి, షేర్ కేటాయింపు వంటి పూర్తి వివరాలు వెల్లడయ్యే అవకాశం ఉంది. ప్రస్తుతం మార్కెట్ వర్గాల దృష్టి మొత్తం జియో ఐపీఓపైనే కేంద్రీకృతమైంది.




## స్థిరంగా ఇంధన ధరలు..
## వాహనదారులకు
# తాత్కాలిక ఊరట

**హైదరాబాద్, జూన్ 19**

అంతర్జాతీయ మార్కెట్‌లో ముడి చమురు ధరల్లో హెచ్చుతగ్గులు కొనసాగుతున్నప్పటికీ, దేశీయంగా పెట్రోల్, డీజిల్ ధరల్లో ఎలాంటి మార్పులు చోటుచేసుకోలేదు. ప్రభుత్వ రంగ చమురు సంస్థలు విడుదల చేసిన తాజా ధరల జాబితా ప్రకారం జూన్ 19న కూడా ఇంధన ధరలు యథాతథంగా కొనసాగాయి. దీంతో వాహనదారులకు ధరల పెరుగుదల నుంచి తాత్కాలిక ఉపశమనం లభించింది. అమెరికా-ఇరాన్ మధ్య ఉద్రిక్తతలు తగ్గుముఖం పట్టడంతో అంతర్జాతీయ మార్కెట్‌లో ముడి చమురు ధరలు కొంత మేర తగ్గినప్పటికీ, దేశీయంగా ఆ ప్రభావం ఇంకా కనిపించలేదు. గతంలో చమురు మార్కెటింగ్ సంస్థలకు వచ్చిన నష్టాలను భర్తీ చేసే ప్రక్రియ కొనసాగుతుండటంతో ప్రస్తుతం ధరల తగ్గింపుపై ఎలాంటి నిర్ణయం తీసుకోలేదని మార్కెట్ వర్గాలు చెబుతున్నాయి. తెలంగాణ రాజధాని హైదరాబాద్‌లో లీటర్ పెట్రోల్ ధర రూ.115.73గా కొనసాగుతుండగా, డీజిల్ ధర రూ.103.82గా స్థిరంగా ఉంది. రాష్ట్రంలో అధిక పన్నుల కారణంగా ఇంధన ధరలు ఇంకా రూ.100కు పైగానే కొనసాగుతున్నాయి. ఆంధ్రప్రదేశ్‌లోని విజయవాడలో లీటర్ పెట్రోల్ ధర రూ.117.78గా, డీజిల్ ధర రూ.104.52గా నమోదైంది. రాష్ట్ర పన్నుల ప్రభావంతో విజయవాడలో ధరలు ఇతర ప్రాంతాలతో పోలిస్తే కొంత ఎక్కువగా ఉన్నాయి. విశాఖ పట్నంలో పెట్రోల్ ధర రూ.116.39గా ఉండగా, డీజిల్ ధర రూ.104.34గా కొనసాగుతోంది. రాష్ట్రంలోని ఇతర నగరాలతో పోలిస్తే విశాఖలో ఇంధన ధరలు స్వల్పంగా తక్కువగా ఉండటం వాహనదారులకు కొంత ఉపశమనంగా మారింది.

# ప్రభాస్ 'స్పిరిట్'లో మాస్ ఎంట్రీకి భారీ ప్లాన్!

**హైదరాబాద్, జూన్ 19**

టాలీవుడ్ స్టార్ దర్శకుడు సందీప్ రెడ్డి వంగా, గ్లోబల్ స్టార్ ప్రభాస్ కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న ప్రతిష్ఠాత్మక చిత్రం 'స్పిరిట్' గురించి ఆసక్తికరమైన వార్తలు సినీ వర్గాల్లో చర్చనీయాంశంగా మారాయి. ఈ చిత్రంలో ప్రభాస్‌ను ఇప్పటివరకు చూడని విధంగా పవర్‌ఫుల్ పోలీసు అధికారిగా చూపించనున్నట్లు తెలుస్తోంది. ముఖ్యంగా అభిమానులకు థియేటర్లలో పూనకాలు తెప్పించేలా ప్రభాస్ పాత్రకు భారీ స్థాయిలో ఎంట్రీ సీన్‌ను దర్శకుడు రూపొందిస్తున్నట్లు సమాచారం. సాధారణంగా సందీప్ రెడ్డి వంగా చిత్రాలు కథ, పాత్రల భావోద్వేగాల చుట్టూ తిరుగుతూ, కమర్షియల్ హంగులకు కొంత దూరంగా ఉంటాయి. అయితే ఈసారి ప్రభాస్ ఇమేజ్‌ను దృష్టిలో పెట్టుకుని ప్రేక్షకులకు కావాల్సిన మాస్ అంశాలను కూడా పుష్కలంగా జోడిస్తున్నారని సినీ వర్గాలు చెబుతున్నాయి. ఇందులో భాగంగా ప్రభాస్‌కు ప్రత్యేకంగా ఒక భారీ ఇంట్రడక్షన్ సాంగ్‌ను కూడా రూపొందించే ఆలోచనలో చిత్ర బృందం ఉన్నట్లు సమాచారం. ఈ ఎంట్రీ సీక్వెన్స్ ప్రభాస్ సినీ కెరీర్‌లోనే అత్యంత గుర్తుండిపోయే సన్నివేశాల్లో ఒకటిగా నిలుస్తుందని ప్రచారం జరుగుతోంది.




# 'డాన్ 3' వివాదంపై రణ్‌వీర్ మౌనం

**ముంబై, జూన్ 19**

బాలీవుడ్ స్టార్ హీరో రణ్‌వీర్ సింగ్ 'డాన్ 3' చిత్రానికి సంబంధించిన వివాదంపై కీలక నిర్ణయం తీసుకున్నట్లు సినీ వర్గాల్లో చర్చ జరుగుతోంది. ఈ అంశంపై కనీసం 18 నెలల పాటు ఎలాంటి వ్యాఖ్యలు చేయకూడదని, అలాగే మీడియాకు ఇంటర్వ్యూలు ఇవ్వకుండా ఉండాలని ఆయన నిర్ణయించుకున్నట్లు సమాచారం. తన తదుపరి చిత్రం 'ప్రళయ్' విడుదలయ్యే వరకు ఈ మౌనం కొనసాగుతుందని బాలీవుడ్ వర్గాలు చెబుతున్నాయి. ఇటీవల ఓ ప్రముఖ సినీ మాధ్యమ ప్రతినిధులు రణ్‌వీర్‌ను కలిసిన సందర్భంగా, 'డాన్ 3' అంశంపై తాను స్పందించనని, కొంత కాలం ఇంటర్వ్యూలకు కూడా దూరంగా ఉంటానని స్పష్టం చేసినట్లు సమాచారం. 'డాన్ 3' చిత్రం విషయంలో రణ్‌వీర్ సింగ్, దర్శకుడు ఫర్హాన్ అక్తర్ మధ్య సృజనాత్మక విభేదాలు తలెత్తినట్లు గత కొంతకాలంగా ప్రచారం సాగుతోంది. కథ, చిత్రీకరణ ప్రణాళికలు, వరుస వాయిదాలు వంటి అంశాలపై అసంతృప్తితో రణ్‌వీర్ ఈ ప్రాజెక్ట్ నుంచి తప్పుకున్నట్లు వార్తలు వెలువడ్డాయి. ఈ వ్యవహారం తరువాత మరింత ముదిరి చట్టపరమైన వివాదంగా మారినట్లు సినీ వర్గాలు పేర్కొంటున్నాయి. నిర్మాణ సంస్థ నుంచి భారీ నష్టపరిహారం డిమాండ్ చేయడం, సినీ కార్మిక సంఘం నుంచి సహకార నిరాకరణ ప్రకటన వెలువడటం వంటి పరిణామాలు చోటుచేసు కున్నాయి. అయితే అనంతరం ఆ ఆదేశాలను ఉపసంహరించుకున్నట్లు సమాచారం. ఇదిలా ఉండగా, రణ్‌వీర్ సింగ్ ప్రస్తుతం 'ప్రళయ్' చిత్రంపై దృష్టి సారించాడు. వినాశనానంతర నేపథ్యంలో సాగే ఈ కథలో భయానక, ఉత్కంఠభరిత అంశాలు ప్రధాన ఆకర్షణగా నిలవనున్నాయి. శిథిలావస్థకు చేరుకున్న ముం బై నగరాన్ని నేపథ్యంగా తీసుకుని ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నారు. ఈ చిత్రానికి జై మెహతా దర్శకత్వం వహిస్తున్నారు. గతంలో పలు విజయవంతమైన ధారావాహికలు, కథా ప్రాజెక్టు లకు సహాయ దర్శకుడిగా పనిచేసిన ఆయనకు ఇది తొలి భారీ చిత్రంగా నిలవనుంది. ప్రము ఖ నిర్మాణ సంస్థలు సంయుక్తంగా ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నాయి.





# 'ఎన్‌బీకే 111'లో కాజల్.. ఫస్ట్‌లుక్ విడుదల

**హైదరాబాద్, జూన్ 19**

నందమూరి బాలకృష్ణ, దర్శకుడు గోపీచంద్ మలినేని కలయికలో రూపొందుతున్న ప్రతిష్ఠాత్మక చిత్రం 'ఎన్‌బీకే 111' నుంచి చిత్రబృందం అభిమానులకు ప్రత్యేక కానుక అందించింది. నటి కాజల్ అగర్వాల్ పుట్టినరోజు సందర్భంగా ఆమె ఫస్ట్‌లుక్ పోస్టర్‌ను విడుదల చేస్తూ, ఈ చిత్రంలో కథానాయికగా నటిస్తున్నట్లు అధికారికంగా ప్రకటించింది. గత కొన్ని వారాలుగా ఈ చిత్రంలో కథానాయిక ఎవరు అన్న అంశంపై పలు ఊహాగానాలు వినిపించగా, తాజా ప్రకటనతో వాటికి తెరపడింది. విడుదలైన పోస్టర్‌లో కాజల్ సాధారణ చీరకట్టులో, కళ్లజోడు ధరించి గంభీరంగా కనిపించింది. కార్యాలయ వాతావరణంలో నిలబడి ఉన్న ఆమె రూపం పాత్ర ప్రాధాన్యాన్ని ప్రతిబింబించేలా ఉండటంతో అభిమానుల్లో ఆసక్తి మరింత పెరిగింది. సాధారణంగా గ్లామర్ పాత్రల్లో కనిపించే కాజల్‌ను ఈ చిత్రంలో భిన్నమైన శైలిలో చూపించడం విశేషంగా మారింది. పోస్టర్‌ను విడుదల చేసిన చిత్రబృందం ఆమెకు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేస్తూ, ఈ చిత్రం ఆమె సినీ ప్రయాణంలో మరో కీలక మైలురాయిగా నిలుస్తుందని పేర్కొంది. ఇది బాలకృష్ణ, కాజల్ కాంబినేషన్‌లో వస్తున్న రెండో చిత్రం. గతంలో విడుదలైన 'భగవంత్ కేసరి'లో వీరిద్దరూ కలిసి నటించి ప్రేక్షకుల ప్రశంసలు అందుకున్నారు. ఆ చిత్రంలో కాజల్ పాత్రకు మంచి గుర్తింపు లభించగా, తాజా చిత్రంలో ఆమె మరింత కీలకమైన పాత్రలో కనిపించనున్నట్లు సినీ వర్గాలు చెబుతున్నాయి. భారీ వ్యయంతో రూపొందుతున్న ఈ చిత్రంలో యాక్షన్, భావోద్వేగ అంశాలకు సమాన ప్రాధాన్యం ఉంటుందని సమాచారం. కథలో కీలక మలుపులు తిప్పే పాత్రలో కాజల్ కనిపించనున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం చిత్రీకరణ శరవేగంగా కొనసాగుతుండగా, త్వరలోనే మరిన్ని విశేషాలను చిత్రబృందం వెల్లడించే అవకాశం ఉంది. బాలకృష్ణ అభిమానులతో పాటు సినీ ప్రేక్షకులు కూడా ఈ చిత్రంపై భారీ అంచనాలు పెట్టుకున్నారు. గోపీచంద్ మలినేని మాస్ టేకింగ్, బాలకృష్ణ శక్తివంతమైన పాత్ర, కాజల్ కీలక పాత్ర ఈ చిత్రానికి ప్రధాన ఆకర్షణలుగా నిలవనున్నాయి.

# మరాఠీ సినిమాకు అండగా నిలిచిన షారుఖ్

**ముంబై, జూన్ 19**

బాలీవుడ్ బాద్‌షా షారుఖ్ ఖాన్ మరోసారి తన గొప్ప మనసును చాటుకున్నారు. తెరపై మాత్రమే కాదు, నిజ జీవితంలోనూ సహాయసహకారాలతో ఎందరో అభిమానుల హృదయాలను గెలుచుకుంటున్న ఆయన, ఒక మరాఠీ చిత్రానికి అండగా నిలిచి దాని విజయానికి పరోక్షంగా కారణమయ్యారని ఆ చిత్ర దర్శకుడు వెల్లడించారు. ఇటీవల విడుదలై మరాఠీ సినీ పరిశ్రమలో సంచలనం సృష్టిస్తున్న 'దేవూల్ బంద్ 2' చిత్ర విజయగాథ వెనుక షారుఖ్ ఖాన్ సహకారం ఉందని దర్శకుడు ప్రవీణ్ తార్డే తెలిపారు. సినిమా విడుదలకు ముందు థియేటర్లలో ప్రదర్శన కోసం అవసరమైన డిజిటల్ ప్రదర్శన ప్యాకేజీ ఖర్చు సుమారు రూ.42 లక్షలు అయ్యిందని చెప్పారు. చిన్న బడ్జెట్ చిత్రంగా తెరకెక్కిన ఈ సినిమాకు అంత మొత్తాన్ని సమకూర్చడం కష్టంగా మారిందన్నారు. ఈ నేపథ్యంలో చిత్రబృందం షారుఖ్ ఖాన్‌కు చెందిన సంస్థను సంప్రదించిందని తెలిపారు. విషయం తెలుసుకున్న షారుఖ్ ఖాన్ వెంటనే స్పందించి, సినిమా విడుదలకు అడ్డంకిగా మారిన ఆ బిల్లును మాఫీ చేయాలని సూచించినట్లు పేర్కొన్నారు.



# సన్నబడటంపై స్పందించిన సమంత.. అసలు కారణం ఇదే!

**హైదరాబాద్, జూన్ 19**

ప్రముఖ కథానాయిక సమంత తన శారీరక ఆకృతిపై సోషల్ మీడియాలో వస్తున్న వ్యాఖ్యలకు ఘాటుగా స్పందించారు. తాను కావాలని బరువు తగ్గలేదని, తీవ్రమైన అనారోగ్య సమస్య కారణంగానే సన్నబడాల్సి వచ్చిందని స్పష్టం చేశారు. ప్రజలు పూర్తి విషయాలు తెలుసుకోకుండా విమర్శలు చేయడం బాధ కలిగిస్తుందని పేర్కొన్నారు. తాజా ఇంటర్వ్యూలో సమంత మాట్లాడుతూ, తాను కండరాల వాపుకు సంబంధించిన మయోసైటిస్ వ్యాధితో పోరాడిన విషయం అందరికీ తెలిసిందే నన్నారు. ఆ వ్యాధి ప్రభావం వల్లే తన బరువు తగ్గిందని, అందం కోసం ప్రత్యేకంగా ఆహార నియమాలు పాటించి సన్నబడలేదని వివరించారు. ప్రస్తుతం తన ఆరోగ్యం గతంతో పోలిస్తే చాలా మెరుగుపడిందని సమంత తెలిపారు. అయితే వైద్యుల సూచనల మేరకు ఇప్పటికీ ఆహార విషయంలో జాగ్రత్తలు తీసుకుంటున్నానన్నారు. అవసరానికి మిం చి తినడం ఆరోగ్యంపై ప్రభావం చూపే అవకాశం ఉండటంతో మితంగా ఆహారం తీసుకుంటున్నట్లు వెల్లడించారు. తీవ్ర అనారోగ్య సమయంలో తనకు ఇష్టమైన ఆహారం తినలేని పరిస్థితిని ఎదుర్కొన్నానని సమంత గుర్తు చేసుకున్నారు.





# 'మా ఇంటి బంగారం'.. సమంత ఖాతాలో మరో విజయవంతమైన చిత్రం

**హైదరాబాద్, జూన్ 19**

మూడేళ్ల విరామం తర్వాత సమంత ప్రధాన పాత్రలో ప్రేక్షకుల ముందుకు వచ్చిన 'మా ఇంటి బంగారం' చిత్రం మంచి అంచనాల నడుమ విడుదలైంది. 'ఓ బేబీ' తర్వాత దర్శకురాలు నందినీరెడ్డి, సమంత కలయికలో వచ్చిన ఈ చిత్రంపై మొదటి నుంచే ఆసక్తి నెలకొంది. ముఖ్యంగా సమంత తొలిసారిగా పూర్తి స్థాయి యాక్షన్ పాత్రలో కనిపించడంతో అభిమానులు ఆసక్తిగా ఎదురుచూశారు. కథ విషయానికి వస్తే, ప్రేమ వివాహం చేసుకుని సంప్రదాయ కుటుంబంలో పెద్ద కోడలిగా అడుగుపెట్టిన స్వర్ణ పాత్రలో సమంత కనిపిస్తుంది. ఇంట్లో తన స్థానాన్ని సంపాదించుకునే ప్రయత్నాలు చేస్తూనే కుటుంబంతో కలిసిపోవడానికి ప్రయత్నిస్తుంది. ఇదే సమయంలో ఆమె గత జీవితం వెంటాడుతూ కథ అనూహ్య మలుపులు తిరుగుతుంది. స్వర్ణగా జీవిస్తున్న ఆమె అసలు పేరు ఝాన్సీ అని బయటపడటం, గతంతో ముడిపడిన ప్రమాదకర వ్యక్తి తిరిగి ఆమె జీవితంలోకి రావడం కథను ఉత్కంఠభరితంగా మారుస్తుంది. సినిమా తొలి భాగం కుటుంబ నేపథ్యంలో సరదాగా సాగుతూ ప్రేక్షకులను ఆకట్టుకుంటుంది. కుటుంబ సభ్యుల మధ్య వచ్చే హాస్య సన్నివేశాలు, పెద్ద కోడలిగా స్వర్ణ ఎదుర్కొనే పరిస్థితులు సహజంగా అనిపిస్తాయి. అనంతరం కథ యాక్షన్, భావోద్వేగాల వైపు మలుపు తిరిగి ఆసక్తిని పెంచుతుంది. సమంత పాత్రలో వచ్చే మార్పు, ఆమె పోరాట సన్నివేశాలు ప్రేక్షకులకు కొత్త అనుభూతిని అందిస్తాయి. రెండో భాగంలో కథ కొంత నెమ్మదించిన భావన కలిగించినప్పటికీ, కీలక ఘట్టాలు, యాక్షన్ సన్నివేశాలు సినిమాను నిలబెడతాయి.



# కృతి-షాహిద్ జోడీ మెప్పించిందా? 'కాక్‌టెయిల్ 2'పై ప్రేక్షకుల తీర్పు ఇదే!

**ముంబై, జూన్ 19**

బాలీవుడ్‌లో ఎంతో ఆసక్తిగా ఎదురుచూసిన రొమాంటిక్ డ్రామా 'కాక్‌టెయిల్ 2' శుక్రవారం ప్రేక్షకుల ముందుకు వచ్చింది. షాహిద్ కపూర్, కృతి సనన్, రష్మిక మందన్న ప్రధాన పాత్రల్లో నటించిన ఈ చిత్రం విడుదలైన తొలి రోజే సోషల్ మీడియాలో విస్తృత చర్చకు దారి తీసింది. గతంలో భారీ విజయాన్ని సాధించిన 'కాక్‌టెయిల్' చిత్రానికి ఆధ్యాత్మిక కొనసాగింపుగా తెరకెక్కిన ఈ సినిమాపై ప్రేక్షకుల్లో ముందుగానే భారీ అంచనాలు నెలకొన్నాయి. ముఖ్యంగా కృతి సనన్ నటన, షాహిద్‌తో ఆమె కెమిస్ట్రీ ప్రేక్షకులను ఆకట్టుకుంటున్నాయని తొలి స్పందనలు సూచిస్తున్నాయి. దర్శకుడు హోమీ అడజానియా తెరకెక్కించిన ఈ చిత్రం విడుదలకు ముందే ముందస్తు బుకింగ్స్ రూపంలో మంచి స్పందనను అందుకుంది. దేశవ్యాప్తంగా వేలాది ప్రదర్శనలకు గాను టికెట్ల విక్రయాలు జోరుగా సాగాయి. విడుదలకు ముందే కోట్ల రూపాయల వసూళ్లు నమోదు కావడంతో చిత్రబృందంలో ఉత్సాహం నెలకొంది. ప్రేమ, భావోద్వేగాలు, స్నేహం చుట్టూ తిరిగే కథ యువతను ఆకర్షించేలా ఉందని సినీ విశ్లేషకులు భావిస్తున్నారు. ఈ చిత్రానికి కేంద్ర చలనచిత్ర ధ్రువీకరణ మండలి ఎలాంటి కత్తిరింపులు లేకుండా ప్రదర్శన అనుమతి ఇవ్వడం విశేషం. దర్శకుడు అనుకున్న కథనాన్ని యథాతథంగా ప్రేక్షకుల ముందుకు తీసుకురావడానికి అవకాశం లభించింది. చిత్రంలోని భావోద్వేగ సన్నివేశాలు, ప్రేమకథ, ప్రధాన తారాగణం నటన సినిమాకు ప్రధాన బలంగా నిలిచాయని తొలి సమీక్షలు పేర్కొంటున్నాయి.

"This newspaper/periodical is published by KALIDINDI SUMALATHA from 1-7-750/1-3, F 103, SRUTHI SADAN APTS ST PIOUS SCHOOL ROAD, RAMNAGAR, HYDERABAD, TELANGANA - 500020. on behalf of **RS USAR PUBLICATIONS**, edited by RAGHURAMA RAJU KALIDINDI and printed by **KALIDINDI SUMALATHA** at **KING DIGITAL OFFSET PRINTERS**, 1-7-750/1-3, F 103, SRUTHI SADAN APTS ST PIOUS SCHOOL ROAD, RAMNAGAR, HYDERABAD, TELANGANA – 500020. **PRGI NO: TGTEL/26/A2948**, Email: rsusarp@myyahoo.com, 9849350555, 9515121467